ప్రజాశక్తి

ఆదివారం 31 మార్చి 2024   8 పేజీలు

ప్రకాశం   బాపట్ల

నేడు చంద్రబాబు రాక

- మార్కాపురంలో బహిరంగ సభ
- జన సమీకరణలో టిడిపి శ్రేణులు
- ప్రస్తావనకు రానున్న ప్రత్యేక జిల్లా, 'వెలిగొండ'



ప్రజాశక్తి-మార్కాపురం

పశ్చిమ ప్రకాశంపై టిడిపి ప్రత్యేక దృష్టి సారించింది. వైసిపి కంచుకోటగా పేరొందిన పశ్చిమ ప్రకాశంపై పట్టు సాధించాలనే లక్ష్యంగా ఆ పార్టీ శ్రేణులు పనిలో నిమగ్నమయ్యారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని టిడిపి శ్రేణులకు దిశానిర్దేశం చేసేందుకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మార్కాపురం పట్టణానికి ఆదివారం రానున్నారు. ఈ సందర్భంగా గడియారం స్తంభం సెంటరులో బహిరంగ సభ నిర్వహించనున్నారు.

ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ సిఎం చంద్రబాబు మార్కాపురానికి ఆదివారం రానున్నారు. మధ్యాహ్నం సమయంలో పట్టణ నడిబొడ్డున గల గడియారం స్తంభం సెంటర్‌లో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ సభకు జన సమీకరణ కోసం ఈ పాటికే ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి కసరత్తు ప్రారంభించారు. భారీ సమీకరణ కోసం ఈ పాటికే క్షేత్రస్థాయి నేతలతో సమావేశాలు నిర్వహించారు. చంద్రబాబు సభలో వెలిగొండ ప్రాజెక్టు పూర్తి స్థాయి నిర్మాణంతో పాటు నిర్వాసితుల సమస్య ప్రస్తావించనున్నట్లు తెలిసింది. ఈ ప్రాంత ఓటర్లను ఆకట్టుకునేందుకు మార్కాపురం ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేస్తానని మరోసారి హామీ ఇవ్వనున్నట్లు సమాచారం.

మతరాజ్యంలా మారుస్తామంటే ఊరుకోం..

- ఇది పాకిస్తాన్ కాదు..భారతదేశం..
- లౌకికరాజ్యంలో అందరికీ మత స్వేచ్ఛ ఉంటుంది..
- మోడీది మత దురహంకార విధానం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు
- ఒంగోలులో వామపక్ష, లౌకిక పార్టీల నిరసన ప్రదర్శన

ర్యాలీలో పాల్గొన్న వి.శ్రీనివాసరావు, పార్టీల నాయకులు, ముస్లిం సోదరులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

'ఇది పాకిస్తాన్ కాదు.. భారతదేశం.. పాకిస్తాన్‌లా మత రాజ్యంగా మారుస్తామని చూస్తూ ఊరుకోం.. భారతదేశం లౌకిక రాజ్యం. ఇక్కడ అందరికీ మత స్వేచ్ఛ ఉంది' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రధాని మోడీ మత దురహంకార విధానాన్ని దేశ ప్రజలందరూ ముక్త కంఠంతో ఖండించాలన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి తిలోదకాలిచ్చి బిజెపి ప్రభుత్వం సిఎఎ వంటి నిరంకుశ చట్టాన్ని చేయటాన్ని వ్యతిరేకిస్తూ ఒంగోలులో వామపక్ష, లౌకిక పార్టీల ఆధ్వర్యంలో శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఒంగోలు పాత మార్కెట్ సెంటర్‌లోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పూలమాల వేసి.. నివాళులర్పించారు. అక్కడి నుంచి ప్రారంభమైన ప్రదర్శన ఒంగోలు కలెక్టరేట్ వరకు సాగింది. అనంతరం జరిగిన కార్యక్రమానికి సిపిఎం నగర కార్యదర్శి జి.రమేష్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో 2014 ముందు పక్క దేశాల వచ్చిన ముస్లింలు, హిందువులు, బుద్ధులు, క్రిస్టియన్స్ ఎవరికైనా సరే ఒకటే నిబంధన ఉండాలి తప్ప ముస్లిములకు పౌరసత్వం ఇవ్వబోమని చెప్పటం సరికాదన్నారు. దేశంలోని ముస్లిములు కూడా ఏ దేశస్తులో

▶ 2లో

కలెక్టరేట్ వద్ద కార్యక్రమంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ఎన్నికల నియమావళి అమలుకు పటిష్ట చర్యలు

- జిల్లాలో 18.41 లక్షల మంది ఓటర్లు
- 5, 7 తేదీల్లో పిఒలకు శిక్షణ
- ప్రెస్‌మీట్‌లో కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ వెల్లడి

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు పటిష్ఠ చర్యలు చేపట్టామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. జిల్లాలోని ఓటర్లు, వారి కోసం ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ విధుల కోసం సిబ్బంది కేటాయింపు- శిక్షణ, ప్రత్యేక బందాల ఏర్పాటు, ఓటర్లను ప్రలోభ పెట్టేలా తరలిస్తున్నట్లుగా గుర్తించిన డబ్బు - వస్తువుల స్వాధీనం వంటి విషయాలలో జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలను శనివారం కలెక్టరేట్ లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 28 నాటికి మొత్తం 18,14,371 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితాలో నమోదు కోసం వచ్చిన దరఖాస్తులు ఈ నెల 16వ తేదీ నాటికి 5,457 పెండింగ్ ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో 3,30,516 ఫోటో ఓటరు గుర్తింపు కార్డులు జనరేట్ కాగా, వాటిలో 2,82,923 కార్డులను రిజిస్టర్ పోస్టు ద్వారా ఓటర్లకు పంపించామన్నారు. ప్రింటర్ల నుంచి మరో 3,546 కార్డులు రావాల్సి ఉందని, 42,896 కార్డులు తపాలా శాఖ వద్ద పంపిణీ ప్రక్రియలో ఉన్నట్లు తెలిపారు. పోస్టాఫీస్ నుంచి డెలివరీ కాకుండా 1,151 కార్డులు వెనక్కి వచ్చాయని, వీటిని బిఎల్‌ఒల ద్వారా ఓటర్లకు పంపిణీ చేశామన్నారు. ఎపిక్ కార్డులు లేని ఓటర్లు ఎన్నికల సంఘం గుర్తించిన 12 రకాల ఇతర గుర్తింపు కార్డులను చూపించి తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. ఒంగోలులోని రైజ్ కాలేజీలో రిసెప్షన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఐదు నియోజకవర్గాలకు సంబంధించి ప్రత్యేకంగా మధ్యంతర (ఇంటర్మీడియట్) స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గానికి మార్కాపురంలో గుర్తించామన్నారు. దర్శి, మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాలకు స్థానికంగానే మధ్యంతర స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు.

12న ఈవిఎంల ర్యాండమైజేషన్

ఏప్రిల్ 12న రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవిఎం మొదటి విడత ర్యాండమైజేషన్ నిర్వహిస్తామని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. మే 2వ తేదీన ఎన్నికల పరిశీలకులు, పోటీ చేస్తున్న అభ్యర్థుల సమక్షంలో 2వ విడత ర్యాండమైజేషన్ చేస్తామన్నారు. ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు మ్యాన్ పవర్ మేనేజ్ మెంట్, ట్రైనింగ్ మేనేజ్ మెంట్, మెటీరియల్ మేనేజ్‌మెంట్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్, కంప్యూటరైజేషన్- సైబర్ సెక్యూరిటీ, స్వీప్, శాంతిభద్రతలు, ఈవిఎం మేనేజ్మెంట్, ఈవిఎం స్టోరేజీ కౌంటింక్ లోకేషన్స్, మోడల్ కోడ్ అమలు, ఎన్నికల వ్యయ పరిశీలన, పోస్టల్ బ్యాలెట్స్, ఎం.సి.ఎం.సి., కమ్యూనికేషన్ ప్రణాళిక, ఓటర్ల జాబితా సవరణ, హెల్ప్ లైన్ ఫిర్యాదులు, ఎలక్షన్ అబ్జర్వర్స్ సహాయం పై జిల్లా స్థాయిలోనూ, నియోజకవర్గ స్థాయిలోనూ ప్రత్యేక నోడల్ ఆఫీసర్లను నియమించామన్నారు. అదేవిధంగా సి- విజిల్, కాల్ సెంటర్ ద్వారా వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి, ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకుండా పర్యవేక్షించడానికి ఎలక్ట్రానిక్ మీడియాలోనూ, సోషల్ మీడియాలోనూ వచ్చే కథనాలను పరిశీలించడానికి, స్వీప్, సువిధ యాప్ ద్వారా

▶ 2లో

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు సస్పెన్షన్

8లో ▶

మతరాజ్యంలా మారుస్తామంటే ఊరుకోం..

(మొదటిపేజీ తరువాయి)

నిరూపించుకునే తరువాతే పౌరసత్వం ఖరారు చేస్తామంటే రెండో తరగతి పౌరులుగా బతకాల్సిన పరిస్థితి వారికి వస్తుందన్నారు. అన్ని మతాలను సమానంగా రాజ్యాంగం గౌరవిస్తుందన్నారు. దేశం నుంచి అమెరికా లక్షలాది మంది వెళుతున్నారని, దేశం నుంచి వచ్చిన క్రైస్తవులకు మాత్రమే పౌరసత్వం ఇస్తామని, మిగిలిన వారికి ఇవ్వమని చెబితే ఎలా ఉంటుందో, మోడీ ప్రభుత్వం చేస్తున్న విధానం అవిధంగా ఉందన్నారు. మోడీ దురంకార విధానాన్ని అందరూ ఖండించాలన్నారు. కొత్త పార్లమెంట్లో ఇండియా కూటమి సిఏఏకు వ్యతిరేకంగా బిల్లు పెడుతుందని, బలపరుస్తారో, వ్యతిరేకిస్తారో వైసిపి, టిడిపి వారి వైఖరిని స్పష్టం చేయాలన్నారు. లౌకిక పార్టీలని చెప్పుకుంటూ ఒక పార్టీ బిజెపితో కలిసిందని, మరో పార్టీ లొంగిపోయిందన్నారు. సిఏఏ రద్దుకు తాము అంగీకారమని వైసిపి, టిడిపి చెప్పాలని కోరారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ 2019లో సిఏఏను దేశవ్యాప్తంగా వ్యతిరేకించటంతో అప్పుడు మూలనపెట్టి.. మళ్లీ ఎన్నికలలో లబ్ధి పొందేందుకు తెరపైకి తెచ్చారన్నారు. 1950 నుంచి పౌరసత్వ చట్టానికి అనేక సవరణలు చేశారని, ప్రస్తుత చట్టంతో ముస్లిములతో పాటు ఇతర మైనార్టీ వర్గాలకు అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని వైసిపి, టిడిపిలు సిఏఏకు అనుకూలంగా ఓటు వేసి ముస్లిముల హక్కులు కాపాడుతామని చెప్పటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఇప్పటికైనా సిఏఏ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఈదా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సిఏఏ అమలుతో దేశంలో ముస్లిం మైనార్టీలు తాము దేశ పౌరులమని నిరూపించుకోవాల్సి వస్తుందన్నారు. బిజెపి హిందువుల ఓట్లు సంపాదించుటమే లక్ష్యంగా అమలు చేయనున్న సిఏఏను అందరూ వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌డి హనీఫ్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ ప్రసంగించారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకురాలు ఎస్ లలితకుమారి, సిపిఎం జిల్లా నాయకులు జాలా అంజయ్య, వై.సిద్ధయ్య, జివి కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, ఎస్‌కె మాబు, కంకణాల ఆంజనేయులు, కె.రమాదేవి, వి బాల కోటయ్య, బి రఘురామ్, సిహెచ్ వినోద్, కెఎఫ్ బాబు, ఎస్‌డి హుస్సేన్, సిపిఐ నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, ఎస్‌డి సర్దార్, పివిఆర్ చౌదరి, కరవది సుబ్బారావు, వీరారెడ్డి, ఆర్.లక్ష్మి, సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు సాగర్, ఎల్ రాజశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు యు.మల్లికార్జునరావు, ఎస్‌కె రసూల్, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి జిల్లా నాయకులు షేక్ కరిముల్లా, సయ్యద్ ఇస్మాయిల్, ఆసిఫ్, రౌఫ్, ఖాజా రియాజ్, ముస్లిం సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షులు మహ్మద్ రఫీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌కె ఖాదర్ బాషా, ముస్లిం సంఘాల నాయకులు, వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత పాలిటెక్నిక్ ఎంట్రన్స్ కోచింగ్

ప్రజాశక్తి-వేటపాలెం: ఉచిత పాలిటెక్నిక్ ఎంట్రన్స్ కోచింగ్ నిర్వహిస్తున్నట్లు సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పాలిటెక్నిక్ చేరబోయే విద్యార్థులకు నిర్వహించబడుచున్న పాలిసెట్-2024కు సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, చీరాలలో ఉచిత పాలిటెక్నిక్ ఎంట్రన్స్ కోచింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె జగదీష్‌బాబు తెలిపారు. ది. 27-4-2024, శనివారం నిర్వహించబోయే పాలిసెట్-2024నకు హాజరయ్యే అభ్యర్థులకు ది.1-4-2024 సోమవారం నుంచి 26-4-2024 శుక్రవారం వరకు ఉచితంగా పాలిటెక్నిక్ ఎంట్రన్స్ టెస్ట్ కోచింగ్ నిర్వహిస్తున్నట్లు సెయింట్ ఆన్స్ పాలిటెక్నిక్ కళాశాల, డిప్యూటీ డైరెక్టర్ కె విజయ భాస్కర‌రెడ్డి తెలిపారు. పాలిటెక్నిక్ ఎంట్రన్స్ టెస్టుకు శిక్షణ, ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను ఇస్తున్నట్లు తెలిపారు. ఉచిత పాలిటెక్నిక్ ఎంట్రన్స్ టెస్టు శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులకు చీరాల, బాపట్ల పరిసర ప్రాంతాల నుంచి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఫస్ట్ ఇయర్ కో-ఆర్డినేటర్ ఎస్ అమరనాథ బాబు తెలిపారు. ఈ ఉచిత కోచింగ్‌లో పాల్గొనేందుకు ఆసక్తిగల విద్యార్థులు 9505518288, 9704326660, 8074430250, 7207123457 నెంబర్లలో సంప్రదించి, తమ పేరును రిజిస్టరు చేసుకోవాలని కోరారు.

బీసీలకు భరోసానిచ్చేందుకే 'జయహో బీసీ'

ప్రజాశక్తి-రేపల్లె: వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీలకు రక్షణ కరువైందని, వారికి రక్షణ కల్పించే దిశగా భరోసా ఇచ్చేందుకు టిడిపి జయహో బీసీ కార్యక్రమం నిర్వహిస్తోందని రేపల్లె శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్ అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించిన ఘనత టిడిపిదేనని, 34శాతం ఉన్న రిజర్వేషన్లను 24శాతానికి తగ్గించి జగన్‌రెడ్డి బీసీలకు అన్యాయం చేశారన్నారు.

జగన్ పచ్చి అబద్ధాల కోరు: ఎంఎం కొండయ్య

ప్రజాశక్తి-చీరాల: బాబాయి హత్య వెనుక సూత్రధారిగా వ్యవహరించిన సిఎం జగన్ తన బాబాయిని చంపినది ఎవరో దేవుడికే తెలియాలి అంటూ తప్పించుకుంటున్న సిఎం జగన్ పచ్చి అబద్ధాలకోరు అని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ నెల 31వ తేదీ ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు బాపట్లలో ఉన్న బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద జరుగనున్న బహిరంగ సభకు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల సభలలో చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డి హంతకులను పక్కనే పెట్టుకుని బెదిరింపుగా మాట్లాడుతున్నారన్నారు. ఆయన మాటలతో విసుగు చెందిన ఆయన చెల్లెళ్లు జగనన్నకు ఓటు వేయవద్దు అంటున్నారని గుర్తు చేశారు. వైసిపి ప్రభుత్వం బరితెగించి సభలను అడ్డు కోవాలని చూస్తున్నారని శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. తనకు అభ్యర్థిగా అవకాశం ఇస్తే తనపై కొన్ని శక్తులు దుష్ప్రచారం చేస్తున్నారని, కానీ సహనంతో అందరినీ కలుపుకుని ముందుకు వెడతానని అన్నారు. సమన్వయంతో పని చేసి రానున్న ఎన్నికలలో విజయం సాధిస్తానని విశ్వాసం వ్యక్తం చేశారు. అనంతరం మండలంలోని వాడరేవు గ్రామంలో కొలువై ఉన్న పోలేరమ్మ అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తోటవారిపాలెం, భావనారుషిపేట, చంద్రమౌళి నగర్ నివాసులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టిడిపి సూపర్ సిక్స్ పథకాల గురించి, బీసీ డిక్లరేషన్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గజవెల్లి శ్రీను, కౌతవరపు జనార్దన్, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అమలుకు పటిష్ట చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

వచ్చే అప్లికేషన్లను పరిష్కరించడానికి, ఎన్నికల వ్యయ నిర్వహణ, ఎన్నికల వెబ్ కాస్టింగ్ పరిశీలించడానికి కూడా జిల్లా స్థాయిలో పలువురు అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమించామని చెప్పారు. వాలంటీర్లు, ఉద్యోగులు, పోలింగ్ స్టేషన్లు, డోర్ నెంబర్లలో తప్పులు, ఓటర్లకు బహుమతుల పంపిణీకి సంబంధించి ఇప్పటివరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) కార్యాలయం నుంచి 29 ఫిర్యాదులు రాగా, వాటిలో 25 పరిష్కరించి నివేదిక సమర్పించామని, మిగిలిన ఫిర్యాదులను పరిశీలన చేస్తున్నామన్నారు. జిల్లాలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన, రాజకీయ పార్టీల సమావేశాల నిర్వహణ, నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగులు, వాలంటీర్లు వ్యవహరిస్తున్నారంటూ పత్రికలలో వచ్చిన 84 వార్తలపై విచారణ జరిపి చర్యలు తీసుకున్నామన్నారు. ఒక రెగ్యులర్ ఉద్యోగి, ఏడుగురు కాంట్రాక్టు ఉద్యోగులు, 20 మంది వాలంటీర్లు, ఇద్దరు రేషన్ షాపు డీలర్లపైనా చర్యలు తీసుకున్నామని చెప్పారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై..

ఎన్నికల సంఘం నిర్దేశం మేరకు అర్హులు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రింట్, ఎలక్ట్రానిక్/సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ప్రకటనలకు ముందుగానే అనుమతి ఇవ్వడానికి జిల్లా స్థాయిలో ఎం.సి.ఎం.సి. కమిటీ విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా సువిధ యాప్ ద్వారా కూడా సభలు, ర్యాలీలు, వాహనాలపై లౌడ్ స్పీకర్లతో ప్రచారం వంటి అనుమతుల కోసం 334 అర్జీలు వచ్చాయని, వీటిలో 211 అర్జీలను ఆమోదించామన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఎన్నికల ఖర్చును పరిశీలించడానికి, ఓటర్లను ప్రలోభ పెట్టేలా డబ్బు, ఇతర వస్తువుల రవాణాను అడ్డుకునేందుకు 24 ఎఫ్‌ఎస్‌టి, 40 ఎస్‌ఎస్‌టి, 25 ఎస్‌ఎస్‌టి, 9 వివిటి, 9 అకౌంటింగ్ టీమ్స్, 9 ఏఈఒల టీమ్‌లు, 50 ఎంసిసి టీమ్స్, 263 సెక్టార్ ఆఫీసర్లను నియమించామన్నారు. వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ, టి.డి.పి, జనసేన, కాంగ్రెస్, బి.ఎస్.పి, బి.జె.పి. కలిపి జిల్లాలో ఇప్పటివరకు రూ.18,54,500ను ఎన్నికల ప్రచార ఖర్చు చేశాయన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టేలా తరలిస్తున్న రూ.75,46,985 విలువైన నగదు, వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో పార్టీలు, అభ్యర్థులకు వ్యతిరేకంగా వచ్చిన వార్తలు/ఫిర్యాదులపై ఆయా పార్టీలకు, అభ్యర్థులకు నోటీసులు పంపించి వివరణ తీసుకున్నామన్నారు. జిల్లాలోని మొత్తం 2,183 పోలింగ్ స్టేషన్లకు గాను, 486 పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మకమైనవిగా గుర్తించామన్నారు.

స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు జరిగేలా జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ దిశగా సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 28వ తేదీన పోలింగ్ సిబ్బందికి మొదటి విడత ర్యాండమైజేషన్ కూడా నిర్వహించామన్నారు. పిఒలు, ఏపిఒలకు ఏప్రిల్ 5, 7 తేదీలలో మొదటి విడత శిక్షణ ఇస్తామన్నారు. ఓటు విలువను తెలియజేస్తూ జిల్లావ్యాప్తంగా విస్తృత స్థాయిలో స్వీప్ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాలలో ఈసారి ఓటింగ్ శాతం పెరిగేలా వారిలో ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో డిఆర్ఒ ఆర్. శ్రీలత, సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, వివిధ విభాగాల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

'సెయింట్ ఆన్స్' ప్రిన్సిపాల్‌గా జగదీష్‌బాబు

ప్రజాశక్తి-వేటపాలెం

సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు కె జగదీష్ బాబును ప్రిన్సిపాల్‌గా నియమించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు సంయుక్తంగా శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగాధిపతి కె జగదీశ్ బాబును కళాశాల ప్రిన్సిపాల్‌గా ఏఐసిటి నూతన నిబంధనల ప్రకారం నియమించినట్లు కళాశాల కరస్పాండెంట్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ సి సుబ్బారావు (అక్రిడిటేషన్స్), అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్‌వి రమణమూర్తి, వివిధ విభాగ అధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు కె జగదీష్‌బాబుకు అభినందనలు తెలియజేశారు.

ఒమ్మెవరంలో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ఒమ్మెవరం గ్రామంలో తెలుగుదేశం పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గం అభ్యర్థి బిఎన్ విజయకుమార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇల్లిల్లూ తిరిగి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన ఆరు పథకాలను ప్రజలకు వివరించారు. రాష్ట్ర అభివృద్ధి తెలుగుదేశంతోనే సాధ్యమని వివరించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్, గ్రామ అధ్యక్షులు కొమ్మాలపాటి సురేష్, సర్పంచ్ పాలపర్తి బాలకోటి, మాజీ ఎంపిపి వీరయ్య చౌదరి, గుమ్మడి సాయిబాబు, కాకర్ల లక్ష్మి వరప్రసాద్, రవీంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ ఒంగోలు పట్టణ కాపురస్తురాలు చెరుకూరి వెంకటేశ్వర్లు గారి భార్య వసంత ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయడమేమనగా.

ఒంగోలు పట్టణ కాపురస్తుడు (లేటు) దేవతు కన్నయ్యగారి కుమారుడు వినోద వెంకట కృష్ణారావు గారు లోగా పట్టణ వాస్తవ్యులు అడపా. వెంకయ్యగారి కుమారుడు జోగయ్య వగైరాల వద్ద జనరల్ పవర్ పట్టా తీసుకొని ఒంగోలు పట్టణ కాపురస్తుడు పోలూరి సత్యమధుసూదనరావు వద్ద దిగువ షెడ్యూలు ఆస్తిని డాక్యుమెంట్ నెం. 65/1985రుగా కొనుగోలు చేసి తన స్వాధీనానుభవములో ఉన్న షెడ్యూలు దాఖలా ఆస్తిని మా క్లయింటుకు అమ్మజూపగా మా క్లయింటు కొనుగోలు చేసి కొంత డబ్బు అడ్వాన్సుగా ఇచ్చి విక్రయ ఖరారు అగ్రిమెంటు కూడా వ్రాయించుకొని రిజిస్ట్రరు పొందుటకు సిద్ధముగా ఉన్నది. సదరు ఆస్తి విషయమై ఎవ్వరికైనా ఎలాంటి అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్న యెడల ఈ దినము నుండి పది దినముల లోపల మాకుగాని, మా క్లయింటు గానీ తెలియజేయగలరు లేనిచో షెడ్యూలు ఆస్తిని నిర్వివాదమైన ఆస్తిగా భావించి, మా క్లయింటు క్రమమైన విక్రయ ఖరారు దస్తావేజు పొందుననీ తదుపరి వచ్చు అభ్యంతరములకు మా క్లయింటు బాధ్యులు కాదని ఈ ప్రకటన ద్వారా తెలియజేయటమైనది.

షెడ్యూలు

ప్రకాశం జిల్లా డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ సంతనూతలపాడు.స.రి. యిలాకా సంతనూతలపాడు (మం) పేర్నమిట్ట గ్రామ సర్వే నెం.158/1రులో య. 32.65 సెంట్లు మాకు హక్కుగల య.0.81 సెంట్లులో

తూర్పు : కాట్రగడ్డ రమాదేవిగారి స్థలం.ఈ దిశ 56 అ.లు,
దక్షిణం : 20 అ.ల వెడల్పు గల రోడ్డు. ఈ దిశ 43 అ.లు,
పడమర : దేవతు సుబ్బారావుగారి స్థలం. ఈదిశ56 అ.లు,
ఉత్తరం : చిట్టెం1వెంకటేశ్వర్లుగారి స్థలం.ఈదిశ43.6 అ.లు.

ఈ హద్దులలోని విస్తీర్ణం 05.29/48 సెంట్లు లేక 269 చ.గ.లు లేక 33 గదులు 67 చ.గ.లు గల ఖాళీ స్థలం.

ఇట్లు
సం/- సయింపు వెంకటమల్లిఖార్జునరావు.
పి.బ్రహ్మయ్య,
ఎ.రవికుమార్,
తుమాటి సుకన్యాదేవి,
యస్.ప్రదీప్ చంద్ర చౌదరి.
న్యాయవాదులు, జిల్లా కోర్టు ఎదురు,
గోల్డెన్ టవర్స్, ఒంగోలు,
98482 40802, 94913 07813

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు : కందుకూరు

I.A.No.271/2023
O.S.No.74/2013

కె.ఆనంద రావు,
మరియు ఇతరులు – పిటిషనర్లు / వాదులు
Vs
వి.మాల్యాద్రి – రెస్పాండెంట్ / ప్రతివాది

నోటీసు

To,
వేముల మాల్యాద్రి, తండ్రి కొండిశెట్టి,
ఊళ్ళపాలెం గ్రామం,
సింగరాయకొండ మండలం, ప్రకాశం జిల్లా.

పిటిషనర్లు పై నెంబరు దావాలో డిక్రీ పొంది, ఫైనల్ డిక్రీ పిటిషను దాఖలు చేసినారు. మీరు పై కోర్టు నుండి ఎన్నిసార్లు నోటీసు పంపినను, తీసుకోనందున, కోర్టు వారు నోటీసు పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయమని ఉత్తర్వులు వేసి, పై నెంబరు పిటిషనును **తే08-04-2024ది** వాయిదా వేసియున్నారు. కావున ఆ దినము **ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనియెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరు.

బి.సాయి శంకర్, బి.కాం., బి.ఎల్.,
అడ్వకేట్,
కందుకూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

నోటీసు

మహారాజశ్రీ రేపల్లె సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

I.A.No.99/2023 &
I.A.No.100/2023
IN
IA NO.207/2022
IN
O.S.No.20/2022

బిట్వీన్ :
కాయల చంద్ర ......పిటిషనర్/వాది
మరియు
కూరేటి శివ కోటేశ్వర రావు (డైడ్) మరియు
ఇతరులు ...రెస్పాండెంట్లు/ప్రతివాదులు
R6/D6 : దేగల వరలక్ష్మి,
W/o. వెంకటేశ్వర్ల రావు, వయస్సు 37
సంవత్సరములు, వ్యవసాయం,
R/o. కూరేటి వారిపాలెం గ్రామం,
H/o. కనగాల గ్రామం, అళ్ళవారిపాలెం పంచాయతీ,
చెరుకుపల్లి మండలం, రేపల్లె JCJC.

పై నంబరు గల దావాను వాది-పిటిషనర్ పార్టీషను పరిహారం నిమిత్తం దాఖలు చేసి, Ad-interim injunction పరిహారం నిమిత్తం పిటిషన్ ఐ.ఎ.నెం.207/2022ను దాఖలు చేయగా, ఐ.ఎ.నెం.99/2023 & ఐ.ఎ.నెం.100/2023 నెంబర్లుగా L.Rపిటిషన్స్ దాఖలు చేయగా, Respondent (R6)/ ప్రతివాది (D6) అయిన మీకు పై దావా మరియు పిటిషన్స్ నందు మీకు అనేకసార్లు నోటీసులు పంపించినను మీరు తీసు కొనందున పేపర్ ప్రకటన/నోటీసు ద్వారా పై కోర్టువారిఎదుట ది.12-04-2024కు వాయిదా అయి ఉన్నది. కావున సదరు 12-04-2024 వ తేదీన ఉదయం 10.30 గం.లకు పై కోర్ట్ వారి ఎదుట మీరు స్వయంగా గానీ, మీ తరపు ప్లీడరు గారి ద్వారా గానీ హాజరు అయ్యి, మీకు గల అభ్యంతరాలు తెలుపు కొనవలెను. లేనిఎడల మీ పరోక్షమును తీర్మానించ బడును.

వాయిదా తేది : 12-04-2024

// శ్రీ కోర్ట్ వారి ఉత్తర్వుల ప్రకారం //
ఆర్.వెంకటేశ్వర్లు
కెవి సూర్యారావు
పిటిషనర్ /వాది తరపు న్యాయవాదులు
రేపల్లె

నివాళి అర్పిస్తున్న వైసిపి దర్శి నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ఇర్షాద్ మృతికి బూచేపల్లి సంతాపం

ప్రజాశక్తి-దర్శి

దర్శిలోని పుచ్చలమెట్టకు చెందిన షేక్ షరీఫ్ కుమారుడు ఇర్షాద్ గుండెపోటుతో శుక్రవారం మృతి చెందగా భౌతికకాయానికి దర్శి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాజీ శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా వరికూటి నాగరాజు కూడా నివాళులర్పించారు. షరీఫ్ కుటుంబానికి అండగా ఉంటామని శివప్రసాద్‌రెడ్డి భరోసారు. ఆయన వెంట పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

అండగా ఉంటా.. ఆదరించండి

ఒంగోలు పార్లమెంటు టిడిపి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

"రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం మాది. రాజకీయాల కంటే సేవా కార్యక్రమాలకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చిన వాళ్లం. ప్రస్తుతం టిడిపి కూటమి అభ్యర్థిగా ఒంగోలు పార్లమెంట్ నుంచి పోటీ చేస్తున్నాను. ఆదరించి గెలిపిస్తే ఈ ప్రాంత ప్రజలకు అండగా ఉంటా" అని మాగుంట శ్రీనివాసులురెడ్డి అన్నారు. యర్రగొండపాలెంలోని టిడిపి కార్యాలయానికి కూటమి ఎంపి అభ్యర్థిగా శనివారం తొలిసారిగా వచ్చారు. ఆయన్ను టిడిపి కూటమి నాయకులు శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పలువురు టిడిపిలో చేరారు. అనంతరం పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేసుకొని ఐదు మండల నాయకులను యర్రగొండపాలెం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు పరిచయం చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పచ్చగాలి వీస్తోందని తెలిపారు. ఈ గాలి తుపానుగా మారడం ఖాయమన్నారు. ఈ తుపానులో వైసీపీ కొట్టుకుపోవడం తథ్యమని చెప్పారు. రాబోయే 40 రోజుల వ్యవధిలో టిడిపి రాష్ట్రంలో అధికారంలోకి రానుందని జోస్యం చెప్పారు. వైసీపీ ప్రభుత్వానికి ఇక కాలం చెల్లినట్లేనన్నారు. రాష్ట్రంలో ప్రజలకు మంచి రోజులు రాబోతున్నాయని తెలిపారు.

మాట్లాడుతున్న మాగుంట శ్రీనివాసులు రెడ్డి

కూటమి కార్యకర్తలంతా సైనికుల్లా పని చేసి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యేందుకు శాయశక్తులా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు, టిడిపి మండల కన్వీనర్లు చేకూరి సుబ్బారావు, ఏరువ మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వలరాజు, పయ్యావుల ప్రసాద్, నాయకులు చిట్టేల వెంగళరెడ్డి, శనగా నారాయణరెడ్డి, షేక్ వలి, మంత్రూ నాయక్, వేగినాటి శ్రీనివాస్, కె భాస్కర్, షేక్ మస్తాన్‌వలి, కామేపల్లి వెంకటేశ్వర్లు, పాలడుగు వెంకట కోటయ్యతో పాటు ఐదు మండలాల నాయకులు పాల్గొన్నారు.

బైకును ఢీకొట్టిన కారు

ఒకరికి గాయాలు

ప్రజాశక్తి-మద్దిపాడు

ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఒకరు గాయపడ్డారు. ఈ ఘటన దొడ్డవరప్పాడు గ్రామ సమీపంలోని హైవేపై భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. చీమకుర్తి మండలం క్రిస్టియన్ పాలేనికి చెందిన వంకాయలపాటి ఎలీషా ద్విచక్ర వాహనంపై ఒంగోలు నుంచి గుంటూరు వైపు వెళ్తుండగా మార్గమధ్యంలో దొడ్డవరప్పాడు పరిధిలోని భారత్ పెట్రోల్ బంక్ దగ్గరకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొట్టడంతో ఎలీషా తీవ్రంగా గాయపడ్డాడు. అంబులెన్సు ద్వారా కిమ్స్ హాస్పటల్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

ప్రజాశక్తి-సిఎస్ పురం: మండలంలోని కంభంపాడు గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని పట్టుకొని 10 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. సమాచారం రావడంతో తన సిబ్బందితో వెళ్లి తనిఖీ చేయగా అవరి శ్రీహరి అనే వ్యక్తి మద్యం సీసాలతో పట్టుబడినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పామూరు

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందగా ఇద్దరికి స్వల్ప గాయాలైన సంఘటన నుచ్చుబోత వద్ద శనివారం జరిగింది. ఎల్లన్‌పురం గ్రామానికి చెందిన చాంద్‌బాషా(47), అదే గ్రామానికి చెందిన గంధం సుందరం, మధు, ముగ్గురు వాహనంపై పామూరు వస్తుండగా గుర్తు తెలియని వాహనం వెనక నుంచి వచ్చి ఢీకొనడంతో చాంద్‌బాషా అక్కడికక్కడే చనిపోయాడు. గంధం సుందరానికి కాలు విరిగింది. మధుకు స్వల్ప గాయాలు అవడంతో వారిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చాంద్‌బాషాకు, భార్య, ఇద్దరు కుమారులు సంతానం కున్నారు.

టిడిపిలో చేరుతున్న కార్యకర్తలు

టీడీపీలో పది కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-పుల్లలచెరువు

పుల్లలచెరువు మండలం కవలకుంట్ల గ్రామం నుంచి 10 వైసీపీ కుటుంబాలు యర్రగొండపాలెం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు సమక్షంలో టీడీపీలో చేరాయి. వారిని మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎరిక్షన్‌బాబు కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

కేటీసీలో నేడు ఉచిత అవగాహన సదస్సు

ప్రజాశక్తి-కనిగిరి

కెటిసి ఎడ్యుకేషనల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ కెటిసి పాపారాయుడు అధ్యక్షతన కనిగిరి పట్టణంలోని కెటిసి స్టడీ సర్కిల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు 10వ తరగతి పూర్తయిన విద్యార్థుల కోసం పదో తరగతి తర్వాత కోర్సులపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్థుల కోసం ఇంటర్మీడియట్ తర్వాత కోర్సులపై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పదో తరగతి మరియు ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్థులు అందరూ వినియోగించుకోవాలని కోరారు.

పలు గ్రామాల్లో పోలీసుల కవాతు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల మండలంలోని నల్లగుంట్ల, వైచెర్లోపల్లి, యడవల్లి గ్రామాలో శనివారం ఎస్ఐ అంకమరావు ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. జరుగనున్న ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రజలంతా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

స్వేచ్ఛగా ఓటు వేయండి

యర్రగొండపాలెం ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ పి శ్రీలేఖ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి శ్రీలేఖ

ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని యర్రగొండపాలెం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ పి శ్రీలేఖ అన్నారు. గురువారం యర్రగొండ పాలెంలోని తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకే అభ్యర్థులు నడుచుకోవాలన్నారు. మత ప్రచారాలు చేయ డం, డబ్బులు పంచడం, గొడవలు సృష్టించడం వంటివి చేయకూడద న్నారు. ప్రతి అభ్యర్థి రూ.40 లక్షలకు మించి ఖర్చు చేయరాదన్నారు. నియోజకవర్గంలో 265 పోలింగ్ స్టేషన్లు ఉండగా వాటిలో 57 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు 16 మంది నోడల్ ఆఫీసర్లతో పాటు ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు 8 మంది చొప్పున సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. తమ పరిధిలో నాలుగు, ఫారెస్ట్ అధికారుల పరిధిలో ఒకటి, పోలీస్ అధికారుల పరిధిలో నాలుగు మొత్తం తొమ్మిది చెక్ పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 2,06,473 మంది ఓటర్లు ఉన్నారన్నారు. కొత్తగా ఓటర్ల నమోదుకు ఏప్రిల్ 14 వరకు గడువు ఉందన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారంతా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న పాలుట్ల గిరిజన గూడెంలో మొదటి పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశామన్నారు. అక్కడ 961 మంది గిరిజనులకు ఓటు హక్కు సజావుగా వినియోగించు కునేందుకు అన్ని వసతులతో పాటు వాహనాల సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. వికలాంగులకు పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్‌లు ఏర్పాటు చేశామ న్నారు. 80 సంవత్సరాలు పైబడి వయసు కలిగి ఓటు హక్కు వినియోగించుకు నేందుకు పోలింగ్ స్టేషన్‌కు రావడం చేతకాని 91 మంది వృద్ధులను గుర్తించి బ్యాలెట్ ఓటు కల్పించినట్లు తెలిపారు. అలాగే ఎన్నికల విధుల్లో ఉన్న జర్నలిస్టులకు సైతం బ్యాలెట్ ఓటు కల్పిస్తామని వివరించారు. యర్రగొండపాలెం మండలంలోని వెంకటాద్రిపాలెంలోని పోలింగ్ స్టేషన్ ఆరులో మొత్తం ఓటర్లు 1256 మంది కాగా వారిలో 643 మంది స్త్రీలు ఉన్నట్లు గుర్తించామన్నారు. పురుషుల కంటే స్త్రీలు అధికంగా ఉండడంతో మోడల్ పోలింగ్ కేంద్రంగా గుర్తించామన్నారు. ఓటర్లు ఎలాంటి భయానికి లోనుకాకుండా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

నేడు బహిరంగ సభ

ప్రజాశక్తి-చీరాల: చీరాల అసెంబ్లీ టికెట్‌ను అన్ని రాజకీయ పార్టీలు బిసిలకే కేటాయించాలని కోరుతూ ఈ నెల 31న స్థానిక గడియారం స్థంభం సెంటర్‌లో సాయంత్రం 4గంటలకు చీరాల అసెంబ్లీ నియోజకవర్గ సామాజిక స్పృహ కలిగిన నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ దళిత ప్రజాసంఘాల నాయకులు కరపత్రాన్ని ఆవిష్కరించారు. శనివారం కొత్తపేటలో వారు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాజకీయ పార్టీ అధిష్టానాలు అందరూ బీసీలను ఓటర్లుగానే చూస్తున్నారని, సీట్లు కేటాయించడంలో మాత్రం వెనక్కు నెట్టేస్తున్నారని అన్నారు. జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో వలస నేతలను పక్కనపెట్టి రాజకీయ పార్టీలు స్థానిక బీసీ నేతలకే సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక బీసీ కులాలకు సంబంధించిన వ్యక్తులకు ఎమ్మెల్యే సీటు కేటాయించి నేటి పరాయి పాలకుల నుంచి చీరాల నియోజకవర్గాన్ని కాపాడుకోవాలని అన్నారు. రాజకీయ పార్టీలు ఎమ్మెల్యే టికెట్‌ను స్థానిక బీసీలకే కేటాయించాలని కోరుతూ నిర్వాహకులు పేర్లి రత్నం, దామర్ల శ్రీకృష్ణమూర్తి ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చుండూరు వాసు, మాచర్ల మోహనరావు, గోసాల ఆశీర్వాదం, మాచవరపు జూలియన్, దామర్ల శ్రీకృష్ణ, మోహన్ కుమార్ ధర్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల మండలం ఐనముక్కల గ్రామంలో శనివారం శ్రీమత్ గణపతి సహిత సీతా లక్ష్మణ హనుమ సమేత శ్రీ పట్టాభి రామచంద్ర స్వామి, జీవత్‌ధ్వజ శిఖర కలశ నూతన విగ్రహ ప్రతిష్ట మహా కుంభాభిషేకం ఘనంగా జరిగింది. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. దేవతామూర్తులను ఊరేగించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేలాదిగా భక్తులు తరలివచ్చి కార్యక్రమాలను తిలకించారు.

గిరిజన సంక్షేమం కోసం పని చేస్తా: తాటిపర్తి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మాట్లాడుతున్న తాటిపర్తి చంద్రశేఖర్

గిరిజనుల సంక్షేమం కోసం ఆహర్నిశలు పని చేస్తానని యర్రగొండపాలెం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. ఆయన యర్రగొండపాలెం మండలంలోని దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో గల పాలుట్ల గిరిజన గూడేన్ని సందర్శించి ఎన్నికల ప్రచారం చేశారు. ప్రజా సేవ చేసేందుకు వచ్చానని, ఎన్నికల్లో ఒక అవకాశం కల్పించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గిరిజనులను కోరారు. ఇంటింటికీ తిరిగి గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట వేసిందని తెలిపారు. గిరిజనులకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను మెరుగు పరిచిందన్నారు. దోర్నాలలో రూ.48 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న గిరిజన సూపర్ స్పెషాలిటీ వైద్యశాల నిర్మాణం వేగవంతంగా పూర్తి అయ్యేందుకు కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గ కేంద్రమైన యర్రగొండపాలెం నుంచి ప్రతి గూడేనికి రోడ్డు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. అనంతరం గిరిజనులతో సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్పిటిసిలు చేదూరి విజయభాస్కర్, మాకం జాన్‌పాల్, సర్పంచ్‌లు రామావత్ అరుణాబాయి, దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, ఏకుల ముసలారెడ్డి, మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, నాయకులు జబివుల్లా, కందూరి గురు, గురిజేపల్లి వలి తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న రేపల్లె ఆర్‌డిఒ హెలా షారోన్

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి - నగరం

మండల కేంద్రం నగరం ప్రధాన కూడలిలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. సదస్సులో రేపల్లె ఆర్‌డిఒ హెలా షారోన్ మాట్లాడారు. ప్రతిఒక్కరు ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఓటు ఆయుధంగా ఉపయోగించి మంచి నాయకులను ఎంచుకోవాలని అన్నారు. వైకల్యం ఉన్నవారికి, 85ఏళ్ల దాటిన వృద్ధులకు ఎన్నికల కమిషన్ కొత్తగా ఇంటివద్దనే ఓటుకు, వినియోగించుకునే సౌలభ్యం కల్పించారని తెలిపారు. బూతుకు వచ్చే వికలాంగుల సౌకర్యార్థం వాహనాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీల్ చైర్ల అందుబాటులో ఉంటాయని అన్నారు. వాటి కోసం రాంప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిఒక్కరు తప్పనిసరిగా బూత్ వద్దకు వచ్చి ఓటుహక్కు వినియోగించు కోవాలని అన్నారు. అనంతరం ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీలల్, ఎంపిడిఒ చక్రవాణి ప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ మస్తానరావు పాల్గొన్నారు.

కార్యకర్తలతో మాట్లాడుతున్న నక్కా ఆనందబాబు

కార్యకర్తలతో ఆనందబాబు సమీక్ష

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది టిడిపి వేమూరు నియోజకవర్గంలో ప్రచారంపై మాజీ మంత్రి నక్కా ఆనందబాబు కార్యకర్తలు, నాయకులతో శనివారం సమీక్షించారు. భట్టిప్రోలు, వెల్లటూరు, పల్లికోన గ్రామాల్లో విడివిడిగా క్లస్టర్ సమావేశాలు నిర్వహించారు. ఎన్నికలపై దిశా నిర్దేశం చేశారు. రానున్న ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కోరారు. వైసీపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ఆగడాలను ప్రజల దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన ఆరు పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ వంశీధర్

ఆరోగ్య సురక్ష ఎంతో ఉపయోగం

ప్రజాశక్తి - శింగరాయకొండ

ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఉపయోగం జరుగుతుందని ఆరోగ్య సురక్ష క్యాంపు అధికారి డాక్టర్ నన్నం వంశీధర్ అన్నారు. మండలంలోని పాత శింగరాయకొండ సచివాలయం దగ్గర ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్యాంపులో డాక్టర్లు ప్రజలకు పరీక్షలు చేశారు. ఎముకులు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ రాఘవేంద్ర, అలర్జీ చర్మవ్యాధుల నిపుణులు డాక్టర్ కె కావ్య ఒంగోలు రిమ్స్ వైద్యశాల నుంచి హాజరు కాగా చీమకుర్తి నుంచి కంటి వైద్య నిపుణులు ఎం.ఎ రాజ్ కుమార్ శిబిరంలో పరీక్షలు చేశారు. ఎంపిడిఒ నీరజ్ కుమారి ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని పర్యవేక్షించారు. సయ్యద్ అక్బర్ బాషా, ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్అలీ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమిని ఓడించండి: సిపిఎం

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

ప్రజాశక్తి - భట్టిప్రోలు

దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించటమే కాక ఆంధ్ర రాష్ట్రానికి బిజెపి చేసిన అన్యాయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి, బిజెపి, ఎన్డీఏ కూటమిని రానున్న ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ, రాష్ట్ర ప్రజలను బిజెపి పాలనలో నరేంద్ర మోడీ తీవ్రంగా మోసం చేశారని ఆరోపించారు. విభజన చట్టం ప్రకారం అమలు చేయాల్సిన అంశాలను పూర్తి చేయకుండా రాష్ట్రానికి అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి రాజధాని లేకపోవడం, దానికి నిధులు కేటాయించకపోవడం, పోలవరం ప్రాజెక్టు నిర్వీర్యం కావడమే కాక విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయటానికి పూనుకోవటం వంటి అన్యాయాన్ని ఆంధ్ర రాష్ట్రానికి బిజెపి చేసిందని అన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

అలాంటి బిజెపికి రానున్న ఎన్నికల్లో బహిరంగంగా టిడిపి, జనసేన పొత్తు కలుపుకోగా పరోక్షంగా వైసిపి కూడా బిజెపికే మద్దతు ఇస్తుందని ఆరోపించారు. రాష్ట్రానికి జరిగే అన్యాయాన్ని ప్రశ్నించకపోగా బిజెపికి మద్దతు పలికి రాష్ట్రానికి మరో మారు అన్యాయం చేయాలని చూస్తున్న ప్రాంతీయ పార్టీలకు ప్రజలు ఓట్లు వేస్తే భవిష్యత్తులో ఆంధ్ర రాష్ట్రం అదోగతి పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో బిజెపి వ్యతిరేక పార్టీలు కూటమిగా ఏర్పడి పనిచేస్తున్నాయని, వాటికి మద్దతునిచ్చి గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్, ఎం సత్యనారాయణ, జి నాగరాజు, దీపాల సత్యనారాయణ, కె రామస్వామి, పి మనోజ్ పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా ప్రచారాలు చేయొద్దు

రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎన్నికల అధికారి ఆదేశాలు

ప్రజాశక్తి - పర్చూరు

అనుమతులు లేకుండా రాజకీయ పార్టీలు ప్రచారాలు, సభలు జరపవద్దని ఎన్నికల అధికారి, బాపట్ల ఆర్‌డిఒ జి రవీందర్ సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకటన ఇచ్చినప్పటి నుండే నియమావళి అమలులో ఉందని తెలిపారు. పార్టీ ఆఫీసులు, సభలు, సమావేశాలు, ర్యాలీలు, కరపత్రాల పంపిణీ ఇలా ప్రతి విషయాలకు అభ్యర్థులు, పార్టీలు అనుమతులు తీసుకోవాలని సూచించారు. సువిధ యాప్ ద్వారా, తమ కార్యాలయంలో గానీ దరకాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ జి రవీందర్

సింగిల్ విండో సిస్టమ్ ద్వారా 24గంటల్లోనే అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. అందరూ ఎన్నికల నియమావళి పాటించాలని కోరారు. సమావేశంలో పర్చూరు, ఇంకొల్లు తహశీల్దారులు సిహెచ్ సుబ్బయ్య, ఎం.ప్రమీల పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పెరుమాళ్లు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - శింగరాయకొండ

స్థానిక మలినేని గ్రూప్ ఆఫ్ కాలేజీ చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు పుట్టినరోజు సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు కళాశాల అధ్యాపకులు డాక్టర్ రాచకొండ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం పండ్లు, ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుమాళ్ళు గత కొంతకాలంగా పేద విద్యార్థులకు విద్యా, వైద్య పరమైన సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. గుంటూరు, ప్రకాశం జిల్లాలోని మలినేని విద్యాసంస్థల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఉజ్వల, డాక్టర్ లీనా, న్యాయ సేవా సహాయకులు పంతగాని వెంకటేశ్వర్లు, షేక్ బచ్చే, మోటుపల్లి వెంకటేశ్వర్లు, వంశీ, సాయికృష్ణ పాల్గొన్నారు.

ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలి

రిజిస్ట్రేషన్ పత్రాలను చూపుతున్న సుభానాయుడు

ప్రజాశక్తి - టంగుటూరు

పట్టా భూమిని ఆక్రమంగా ఆన్‌లైన్ చేయించుకొని అడిగిన వారిపై దౌర్జన్యానికి పాల్పడుతున్న ఆక్రమణదారుడు వాకా వెంకటేశ్వరరెడ్డిపై రెవెన్యూ, పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆలకూరపాడు గ్రామ ఆక్వా రైతు పమిడి సుభానాయుడు కోరారు. మండలంలోని అనంతవరంలో ఆయన విలేకర్లతో శనివారం మాట్లాడారు. పట్టా భూమిని సర్వే చేయాలని కోరారు. 1999లో అనంతవరం గ్రామ రెవిన్యూ సర్వే నెంబర్ 187లో య.6.54సెంట్లు గల భూమి ఉండగా దానిలో తాను య.1.50సెంట్ల భూమిని కొనుగోలు చేసి రొయ్యల సాగు ద్వారా జీవనోపాధి పొందుతున్నట్లు తెలిపారు. అదే సర్వే నెంబర్‌లో య.2.92సెంట్లు భూమి ఉన్న వాకా వెంకటేశ్వరరెడ్డి పాస్‌పుస్తకంలో య.3.25సెంట్లు తనకు ఉన్నట్లుగా ఆక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నట్లు ఆరోపించారు. అయితే అధికంగా య.0.33సెంట్లు భూమి తన భూమిలో ఉన్నట్లు తనపై వెంకటేశ్వరరెడ్డి అనుచరులతో దౌర్జన్యానికి పాల్పడుతున్నాడని అన్నారు. ఇటీవల తన భూమిలో నిర్మించిన కాలువను సైతం వెంకటేశ్వరరెడ్డి కొంత మంది అనుచరుల చేత ధ్వంసం చేసి తనకు రూ.1లక్ష మేరకు నష్టం కలిగించాడని ఆవేదన వ్యక్తం చేశారు. తన య.1.50సెంట్ల భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు అన్నీ ఉన్నాయని, య.0.33సెంట్లు భూమి తన భూమిలో ఉన్నట్లు వెంకటేశ్వరరెడ్డి తగిన ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. దీనిపై గతంలోనే పోలీసు, రెవిన్యూ అధికారులు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని ఆరోపించారు. సర్వే నెం.187 భూమి మొత్తాన్ని రెవిన్యూ అధికారులు సర్వే చేసి ఎవరికి ఎంత భూమి ఉందో గుర్తించి ఆక్రమణకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పొలంలోని కాలువను ధ్వంసం చేసిన దృశ్యం

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఏలూరు సాంబశివరావు

ఏలూరి సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి - కారంచేడు

ఎంఎల్‌ఎ ఏలూరు సాంబశివరావు మండలంలో విస్తృతంగా శనివారం పర్యటించారు. మండలంలోని స్వర్ణ, తిమిడిదపాడు, దగ్గుబాడు గ్రామాల్లో కార్యకర్తలను కలుసుకున్నారు. స్వర్ణ గ్రామంలో టిడిపి కార్యకర్త సోమిశెట్టి శ్రీకాంత్ కుమార్తె ఇటీవల డాబాపైనుంచి పడటంతో ఆయన నివాసంకి వెళ్ళి గాయపడ్డ ఆమెను పరామర్శించారు. అనంతరం గ్రామంలో చింతపల్లి హనుమంతరావు భార్య శివమ్మ ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవల మరణించిన తోట నాగమల్లేశ్వరరావు నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఎస్సీ కాలనీలో పర్యటించారు. బండి కృష్ణను పరామర్శించారు. తిమిడితిపాడు గ్రామానికి చెందిన శిరిమల రాజేష్ చిత్రపటానికి నివాళి ర్పించారు. ఎస్సీ కాలనీలో కంభంపాటి అక్కమ్మను పరామర్శించారు. స్వర్ణ గ్రామంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో అప్రమత్తంగా ఉండాలని కోరారు. పోలింగు బూతు స్థాయిలో ఓటర్ల జాబితాలు పరిశీలించుకోవాలని సూచించారు. దగ్గుబాడులో మాజీ ఎంపిటిసి ముల్లా మబ్బుల్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఆయన వెంట టిడిపి నాయకుడు తిరుమల శెట్టి శ్రీహరి ఉన్నారు.

గృహ ప్రవేశ వేడుకల్లో 'దామచర్ల'

ప్రజాశక్తి - కొండపి

మండలంలోని వెన్నూరు గ్రామంలో మేడిబోయిన రామారావు నూతన గృహ ప్రవేశం కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు దామచర్ల పూర్ణచంద్రరావు పాల్గొన్నారు. అనంతరం టిడిపి నాయకులు, కార్యకర్తలతో పార్టీ పరిస్థితుల గురించి మాట్లాడారు. ఎన్నికలకు కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్యచౌదరి, బిసి సెల్ నాయకులు బత్తుల నారాయణస్వామి, మించాల బ్రహ్మయ్య, నిడమనూరు గ్రామ నాయకులు శ్రీకాంత్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గృహ ప్రవేశ కార్యక్రమంలో దామచర్ల పూర్ణచంద్రరావు

కుక్కల దాడిలో మృతిచెందిన గొర్రె పిల్లలకు

నష్టపరిహారం చెల్లించాలి

ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ప్రజా సంఘాల నాయకులు ● బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

హనుమంతునిపాడు మండలం సీతారాంపురం గ్రామంలో మూడు రోజుల క్రితం కుక్కల దాడిలో గొర్రె పిల్లలు చనిపోయి నష్టపోయిన గొర్రెల పెంపకందారులను ఆదుకోవాలని, చనిపోయిన ఒక్కొక్క జీవానికి రూ.5 వేల నష్టపరిహారం అందించాలని, ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈరోజు హనుమంతునిపాడు మండలం సీతారాంపురం గ్రామాన్ని సందర్శించి బాధితులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ గురువారం సాయంత్రం గ్రామానికి సంబంధించి నూనె బాల గురవయ్య, మల్లెబోయిన తిరుపతయ్య, ఏమారపు తోపు ఈ ముగ్గురికి సంబంధించిన 73 పిల్లలను దొడ్లో తోలి మంచినీళ్ల

బాధితులతో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

తెచ్చుకుందామని పక్కకు వెళ్లారు. కుక్కల మంద వచ్చి దాడి చేయడంతో 68 పిల్లలు అక్కడకక్కడే చనిపోయాయని అన్నారు. దీనికి సంబంధించి సుమారు మూడున్నర లక్షల రూపాయల వరకు నష్టం ఉంటుందని తెలిపారు. ఇంకో 10 రోజుల్లో పిల్లలను బేరం పెట్టి అమ్ముదామని అనుకుంటున్న సమయంలో ఈ దారుణమైన సంఘటన జరిగిందని అన్నారు. ఈ సంవత్సరం ఆదాయం మొత్తం పోయి నష్టం వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు మాట్లాడుతూ జిల్లాలో అనేక చోట్ల ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, అయినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సందర్భాల్లో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయి వృత్తిని వదిలేసు కోవాల్సిన పరిస్థితులు, కుటుంబాలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. కనుక రాష్ట్ర ప్రభుత్వం వీరిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. పంచాయతీ అధికారులు కుక్కల నియంత్రణకు వెంటనే చర్యలు తీసుకోవాలని, చనిపోయిన ఒక్కొక్క జీవానికి రూ.5 వేల నష్టపరిహారం అందించాలని, ప్రభుత్వ బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు ఇప్పించి బాధితులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిరుపతయ్య, నూనె బాలగురవయ్య, వేమారపు తోపు, ఎన్ నవీన్ పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్త వెంకటరావును పరామర్శిస్తున్న మంత్రి నాగార్జున

వైసీపి కార్యకర్తకు మంత్రి పరామర్శ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని, పేర్నమిట్ట 40వ డివిజన్ వైసీపీ కార్యకర్త బుట్టి వెంకట్రావును మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున శనివారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. మంత్రి నాగార్జున వెంట వైసీపీ సంతనూతలపాడు మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, పేర్నమిట్ట నాయకుడు, జేసీఎస్ కన్వీనర్ కత్తినేని శ్రీనివాసరెడ్డి, నాయకులు నూకతోటి ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

గిద్దలూరు స్వతంత్ర అభ్యర్థిగా ఉషారాణిరెడ్డి

ప్రజాశక్తి-కొమరోలు

ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గంలో ఎన్నికల హీట్ మొదలైంది. ఇప్పటికే టిడిపి, వైసిపిల నుంచి పోటీ చేసే అభ్యర్థులు ఎవరనేది తెలిసిందే. ఆ అభ్యర్థులకు తామేమీ తక్కువ కాదంటూ స్వతంత్ర అభ్యర్థులు కూడా 2024 అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. అంతేకాదు ఏకంగా తమ మేనిఫెస్టోను కూడా ప్రకటించేస్తున్నారు. కొమరోలు మండలం గోపాలునిపల్లి గ్రామానికి చెందిన వీరంరెడ్డి ఉషారాణిరెడ్డి తాను 2024 అసెంబ్లీ ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, శనివారం ప్రకటించారు. వ్యవసాయ కుటుంబం నుంచి వెలుగులోకి వచ్చిన ఉషారాణిరెడ్డి భర్త వీరంరెడ్డి నరసింహారెడ్డి వృత్తి రీత్యా ఏఆర్ఎస్ఐగా ప్రస్తుతం విధులు నిర్వహిస్తు న్నారు. రాజకీయ అనుభవజ్ఞుడైన తన భర్త నరసింహారెడ్డి తండ్రి, తన మామ అయినటువంటి వీరంరెడ్డి నారాయణరెడ్డిని ఆదర్శంగా

వీరంరెడ్డి ఉషారాణిరెడ్డి

తీసుకుని ఉషారాణిరెడ్డి రాజకీయాలలోకి వస్తున్నానని తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే గిద్దలూరులో ప్రధాన సమస్య లను పరిష్కరిస్తానని అంటున్నారు. అంతేగాక గుండ్లమోటు ప్రాజెక్టు పూర్తి, సగిలేరు వాగు సమస్య, రాచర్ల రైల్వే గేటు సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తానని అంటున్నారు. అలానే టమాటా రైతులకు ఈ ప్రాంతంలో మేలు చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఈ ప్రాంతంలో టమాటా సాస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయిస్తానన్నారు. తద్వారా యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లవలసిన అవసరం లేకుండా ఈ ప్రాంతంలోనే పరిశ్రమలు స్థాపించడం వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారిస్తామని అన్నారు. అలాగే కొమరోలు ప్రాంతం ప్రజలకు వారి పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయిస్తానని ఉషారాణి రెడ్డి అన్నారు.

పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి

టీడీపీలో పలు కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి ఇన్చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో బేస్తవారిపేట మండలం జేసీ అగ్రహారం మరియు మల్లాపురం గ్రామాలకు చెందిన 150 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి వారికి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి అశోక్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీలో చేరిన పాపిజెన్ని చంద్రశేఖర్, దప్పిలి వీరారెడ్డి, మాజీ సర్పంచ్ మంత్రి నాగరాజు, దేరెడ్డి వెంకటేశ్వర్లు, మూర్క సుబ్బారెడ్డి, దొడ్డి పెద్ద సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బర్త్ డే వేడుకల్లో బీఎన్ విజయ్ కుమార్

బర్త్ డే వేడుకల్లో బీఎన్ విజయ్ కుమార్

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట పరిధిలోని 41వ డివిజన్‌లో శనివారం జరిగిన జనసేన డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ జన్మదిన వేడుకల్లో సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బీఎన్ విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన సమన్వయకర్త కందుకూరి వెంకటేశ్వరరావు(బాబు) పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణకు గడువు పెంపు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ప్రకాశం జిల్లాలోని సంతనూతలపాడు, గణపవరం, అమ్మనబ్రోలు గురుకుల విద్యాలయాలలో 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలోనూ ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణకు గడువు ఏప్రిల్ 5వ తేదీ వరకు పెంచినట్లు ప్రకాశం జిల్లా కన్వీనర్, సంతనూతలపాడు గురుకుల విద్యాలయ ప్రధానాచార్యులు డి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

కదిరిని కలిసిన దద్దాల

కదిరికి బొకే ఇస్తున్న దద్దాల

ప్రజాశక్తి-సిఎస్ పురం

కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావును నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణయాదవ్ శనివారం హైదరాబాదులో ఆయన నివాస గృహంలో కలిశారు. రాబోయే ఎన్నికల్లో కనిగిరి నియోజకవర్గంలో తన గెలుపునకు కృషి చేయాలని కదిరిని కోరారు. ఆయన వెంట జిల్లా జడ్పీటీసీల సంఘం అధ్యక్షులు గుంటక తిరుపతిరెడ్డి, సిఎస్ పురం వైస్ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి, పాలుగుళ్ల మల్లికార్జునరెడ్డి, బస్విశాఖ రవిచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు నిలిచిపోయిన మంచినీటి ట్యాంకును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కమీషన్లకు కక్కుర్తిపడి

తాగునీటి పథకం నిలుపుదల: కాంగ్రెస్

ప్రజాశక్తి-చీమకుర్తి

కమీషన్లకు కక్కుర్తిపడి అధికార పార్టీ నాయకులు 30 వేల మందికి తాగునీరు అందించే చీమకుర్తి మంచినీటి పథకాన్ని నిలుపుదల చేశారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి రవి విమర్శించారు. శనివారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మద్ది వెంకటేశ్వర్లు నాయకత్వంలో మంచినీటి పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా దాసరి రవి మాట్లాడుతూ 2018లో సెంట్రల్ ఆసియా అభివృద్ధి బ్యాంకు మంచినీటి పథకానికి రూ.68 కోట్లు రిలీజ్ చేయగా భూసేకరణ చేసి, నాగార్జున వర్క్స్ కంపెనీకి పనులు అప్పగించారు. అధికార పార్టీ నాయకులు కాంట్రాక్టరు నుంచి రూ.10 కోట్లు కమీషన్ డిమాండ్ చేశారన్నారు. కంపెనీ పనులు నిలుపుదల చేసిందన్నారు. రాబోయే ఎన్నికల్లో అధికార పార్టీని ఓడించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలకు నిరంతరం తాగునీరు అందిస్తుందన్నారు. ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సంతనూతలపాడు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గుత్తిరాజు, వెంకటరావు, జానీ పాల్గొన్నారు.

డెడ్ స్టోరేజీకి చేరిన నీటిమట్టం

ప్రజాశక్తి-చీమకుర్తి

రామతీర్థం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరింది. గత ఇరవై రోజులుగా ఒంగోలు-1, ఒంగోలు-2 సమ్మర్ స్టోరేజీలను 75శాతం రామతీర్థం నీటితో నింపారు. వేసవి దృష్ట్యా ప్రభుత్వం పది రోజులపాటు సాగరు జలాలతో రామతీర్థం రిజర్వాయర్‌కు నీటిని వదిలారు. గత ఇరవై రోజులుగా ఒంగోలు సమ్మర్ స్టోరేజీ-1, ఒంగోలు సమ్మర్ స్టోరేజీ-2లను, కారుమంచి కాలువ కింద ఉన్న రెండు మంచినీటి చెరువులను, త్రోవగుంట మేజరు కాలువ కింద ఉన్న 10 మంచినీటి చెరువులను, చీమకుర్తి చెరువును రామతీర్థం జలాశయం నుంచి నీటితో నింపారు. శుక్రవారం సాయంత్రం నీటిని రిజర్వాయర్ నుంచి కిందికి వదలడం ఆపేశారు. ప్రస్తుతం డెడ్‌స్టోరేజీ 75 మీటర్లు నీటిమట్టం ఉంది. ఏప్రిల్ నెలలో వేసవి దృష్ట్యా మళ్లీ రామతీర్థం రిజర్వాయర్‌కు సాగరు జలాలు వదిలే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

డెడ్ స్టోరేజీకి చేరిన రామతీర్థం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్

'ఆకుపాటి'కి డాక్టరేట్

ప్రజాశక్తి-పామూరు: పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి, పట్టణ రెండో ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్‌ను ప్రతిష్టాత్మకమైన ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ వరించింది. ఈ సందర్భంగా తమిళనాడులోని హోసూర్ ప్రాంతంలో యూనివర్సిటీ ఏర్పాటు చేసిన సామాజిక సేవ విభాగంలో ఆకుపాటికి డాక్టరేట్‌ను యూనివర్సిటీ సభ్యులు ప్రదానం చేసి.. ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆకుపాటి మాట్లాడుతూ సమాజ సేవలో తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని అన్నారు. భవిష్యత్తులో సమాజానికి సేవ చేయాలనే దృక్పథంతో ఉన్నట్లు తెలిపారు. ఆకుపాటి మిత్రులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని ఉప్పుగుండూరులో ఒకటో సచివాలయ పరిధిలో శనివారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిపి, షుగర్, ఇసిజి, రక్త పరీక్షలు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులు అందజేశారు. ఆరోగ్య సురక్ష ద్వార వివిధ రకాల వైద్య పరీక్షలతో పాటు ఇంటివద్దకే వైద్యం అందిస్తారని నాగులుప్పలపాడు ప్రాథమిక వైద్యశాల డాక్టరు ఒనారియల్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దిగజారిన ధరలతో రైతు దిగాలు

• దిగుబడులు తగ్గిన లేత శనగ • ఎక్కువగా యంత్రాలతోనే నూర్పిడి • యంత్రాలతో లేతశనగ నూర్పిడిలో మట్టిదెబ్బ • కూలీలతోనే పీకుడు, నూర్పిళ్లు చేస్తున్నరైతులు

ప్రజాశక్తి - ఇంకొల్లు

రబీ విత్తన సమయంలో శనగల ధర ఆశాజనకంగా ఉంది. రైతుల్లో ఆశలు రేపింది. ధర బాగుందని ఆశపడ్డ రైతులు సాగుచేశారు. అయితే పంట నూర్పిల్లు అయ్యే సమయానికి ధరలు దిగజారాయి. ప్రత్యేక రకాలైన తెల్ల శనగల ధర ప్రస్తుతం మరింత దిగజారింది. విత్తన సమయంలో క్వింటాలు తెల్ల శనగలు రూ.13వేలకు వ్యాపారులు అమ్మగా ప్రస్తుతం నూర్పిడిలు ముగింసి రైతులు అమ్మాలనుకుంటున్న సమయంలో క్వింటాలు తెల్లశనగల ధర రూ.7500నుంచి రూ.8వేలలోపే ఉంది. వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ప్రస్తుతం వస్తున్నారు. అదీ వ్యాపారం మందకోడిగా సాగుతుంది. జేజే 11 ఎర్ర శనగలు ఈ ఏడాది విత్తే సమయానికి ముందు రూ.6వేల నుంచి రూ.6500 పలకగా ప్రస్తుతం వాటి ధర రూ.5800లోపే పలుకుతుంది.

ముదురు శనగల్లో రకరకాల దిగుబడులు

ఈ ఏడాది తుఫానుకు ముందు వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాలు కురవవు అన్న అనుమానంతో అప్పటి వాతావరణ పరిస్థితిని బట్టి రైతులు రబీ పంట ఆలస్యం అవుతుందని శనగ విత్తనాలు చాలీచాలని పదనులోనే కొంతమంది రైతులు విత్తనాలు పెట్టారు. అనంతరం మారిన వాతావరణ పరిస్థితుల రీత్య అధిక వర్షాలు, తుఫాను సైతం కొట్టింది. కొన్ని ప్రాంతాల్లో శనగతో పాటు పలు రకాల పంటలు పూర్తిగా ఉరకెత్తి దెబ్బతిన్నాయి. దెబ్బ తినకుండా ఉన్న శనగ పొలాలకు కలుపు బెడద తగిలింది. ఎకరాకు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు కలుపు

నాగండ్లలో లేత శనగను పీకుతున్న కూలీలు

కూలి ఖర్చు అయ్యింది. కొంత మంది కలుపు తీయకుండానే సెనగ పంట వదిలేశారు. ఈ కారణంతో పలు రకాల దిగుబడులు వచ్చాయి. మొక్కజొన్న, మిరప గతంలో వేసిన పంట మార్పిడి చేసిన పొలాల్లో కలుపు తీసిన పొలాల్లో ఎకరాకు 8నుంచి 10కింటాల దిగుబడి వరకు రాగా, కలుపు తీయని ఏటా శనగ పంట సాగు చేసే పొలాల్లో పంట మార్పిడి చేయని పొలాల్లో దిగుబడులు తగ్గాయి. ఎకరాకు 4నుంచి 6క్వింటాళ్లలోపే దిగుబడి వచ్చింది.

యంత్రాలతో శనగ పంట కోతలు

శనగసాగుచేసిన రైతులు ముదురు శనగను ఎక్కువ మంది హార్వెస్టర్ యంత్రాలతోనే నూర్పిడీ చేయిస్తున్నారు. వీటితో ఒకేసారి శనగలు బయటకు వస్తాయి. అదే కూలీలతో అయితే అంత పీకిన తర్వాత నూర్పిడి చేయాలి. ఈపని కూలీలతో అయితే ఎకరాకు రూ.7వేలు ఖర్చు అవుతుంది. అదే హార్డ్వేర్టర్‌తో అయితే ఎకరాకు రూ.3500లకే పంట చేతికొస్తుంది. మట్టి తొలగించే ఖర్చు అదనంగా ఏమీ ఉండదు. అందుకే ఎక్కువ మంది రైతులు హార్డ్వేర్టర్‌తోనే ముదురు కోతలు చేస్తున్నారు.

లేత శనగల్లో తగ్గుతున్న దిగబడులు

కొంత మంది రైతులు వర్షం పోయిన తర్వాత డిసెంబర్ ఆఖరులో లేత శనగ రభీలో విత్తనాలు ఎద పెట్టారు. ఈ లేత శనగ ముందు దెబ్బతిన్న వివిధ రకాల పంటలైన పొగాకు, మిరప, శెనగ వంటివి సాగు చేసిన పొలాల్లో సైతం మళ్లీ ఎద పెట్టారు. అయితే ఈ సెనగకు వాతావరణం అనుకులించలేదు. పదును చాలక పోవడంతో దిగుబడులు బాగా తగ్గుతున్నాయి. ఎకరాకు రెండు క్వింటాల నుంచి చేలో ఉన్న పదును బట్టి 6క్వింటాళ్లలోపే దిగుబడి వస్తుంది. అయితే ఈ లేత సెనగ హార్వెస్టర్‌తో కోతకొస్తే ఎక్కువగా మట్టి వస్తుంది. దీంతో కూలీలతో పీకించటం తప్పనిసరైంది. ఎకరాకు ఎర్రశెనగకు రూ.3వేలు, తెల్ల సెనగకు రూ.3500 నుంచి రూ.4వేలు కూలి చెల్లించవలసి వచ్చింది. దీనికి తోడు నూర్పుడి ఖర్చు మరో రూ.3500 అవుతుంది. తగ్గిన దిగుబడులకు తోడు కోతకూలి, నూర్పుడి ఖర్చు ఎకరాకు రూ.7వేలు అవుతుంది. దీంతో లేత శనగ సాగు చేసిన రైతు ఈ ఏడాది పూర్తిగా నష్టలపాలు కానున్నాడు. కొనుగోలు మందకోడిగా ఉండటానికితోడు ధరలు లేకపోవడంతో ధర పెరిగే వరకు కోల్డు స్టోరేజీల్లో నిల్వ చేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. కూలి, పెట్టుబడులకు అవసరమైన సన్నా, చిన్న కారు రైతులు, కౌలు రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ఉన్న ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రూ.లక్షలు విలువైన వంటచెరుకు దోపిడీ

చెరువులో వంటచెరుకు కోస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కొండపి

కొండపి మైనర్ ఇరిగేషన్ వ్యవసాయ చెరువులో మొలిసిన లక్షలు విలువైన వంట చెరుకును నాయకులు ఎలాంటి బెదురు, బెరుకు లేకుండా అప్పనంగా దొచుకుంటున్నారు. దాదాపు 400 ఎకరాల విస్తీర్ణం కలిగిన చెరువులో ఎంతో విలువైన చిల్లచెట్లు, నల్లతుమ్మ, తెల్ల తుమ్మ చెట్లు మొలిచి ఏళ్లతరబడి పెరిగి చావతేలి ఉన్నాయి. ప్రస్తుతం కొండపిలో పొగాకు పంటను క్యూరింగ్ చేసేందుకు వంట చెరుకు డిమాండ్‌గా మారింది. ఆ క్రమంలో కొండపి మండలానికి చెందిన నాయకుడు తమ పలుకుబడిని వినియోగించి ప్రభుత్వానికి చెందాల్సిన ఈ వంట చెరుకును అప్పనంగా దోచుకొనివెళ్లాడు. దాదాపు కొండపి చెరువులో చిల్లచెట్లు, నల్లతుమ్మ, తెల్లతుమ్మ చెట్లు దట్టంగా పెరిగాయి. వాటి నుంచి ఇరిగేషన్ అధికారులు పారెస్టువారి అంచనాలతో వేలం వేసి వంటచెరుకును విక్రయిస్తే దాదాపు రూ.50లక్షల వరకు ప్రభుత్వానికి ఆదాయం చేకూర్చవచ్చని బహిరంగంగానే ప్రజలు అంటున్నారు. అంతటి విలువైన వంట చెరుకును అధికారుల అండదండలు లేకుండానే నిరబ్యంత్రంగా చెట్లను నరికి అమ్ముకోవడం సాద్య పడే విషయం కాదని అందరికి తెలిసిన విషయమే. దీనిపై విచారిస్తున్న పలువురికి వంట చెరుకును అమ్ముకుంటున్న వ్యక్తి తెలియచేసిన వివరాలు మేరకు సంబందిత అదికారులకు సగం నగదు ముట్ట చెబుతున్నామని బెబుతున్నట్లుగా వారు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఇంత విలువైన వంట చెరుకును ప్రభుత్వానికి గండి కట్టి సదరు వ్యక్తి దోచుకోవడం వెనుక రాజీకయ అండదండలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అదికారులే అక్రమ దారులకు కొమ్ముకాస్తుంటే కంచేచేను మేసిన చందంగా మారిందని పెదవి విరుస్తున్నారు. ఇక ప్రజలు ఆస్తులు కాపాడేవారు ఎవరని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. అదికారులు స్పందించి వంట చెరుకును అక్రమ విక్రయాలను నిలుపుచేయించాలని, ఇప్పడివరకు అక్రమంగా అమ్మకాలు జరిపిన నిధులను తిరిగి రాబట్టి ప్రభుత్వ ఖజానాలో జమచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. విషయంపై ఇరిగేషన్ అదికారిని వివరణ కోరగా చెరువులో వంటచెరుకు అమ్మకాలపై తనకు సమాచారం లేదని, వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రూ.50 లక్షల విద్యుత్ బకాయిలు

ప్రజాశక్తి - కొండపి

మండలంలోని వివిధ ప్రభుత్వా కార్యాలయాల నుండి రూ.50లక్షల వర కు విద్యుత్ బకాయి ఉన్న ట్లు కరెంటు ఎఈ కుంచా ల కోటయ్య తెలిపారు. పెట్లూరు ఆసుపత్రి రూ.2,89,403, కొండపి ఆసుపత్రి రూ.11,96,498, తహశీల్దారు కార్యాలయం రూ.17,08,212, కొండపి పోలీసు స్టేషన్ రూ.59,310, ఫైర్ స్టేషన్ రూ.43,521, విశ్రాంతి భవనం రూ.2,32,434, కొండపి పంచాయితీ ఆపీసు రూ.34,654, ఎంపిడిఒ కార్యాలయం రూ.81,029, గురుకుల పాఠశాల రూ.9,09,657 బకాయిలు ఉన్నట్లు తెలిపారు.

బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - కొండపి

క్రికెట్ బెట్టింగులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని సిఐ పాండురంగరావు హెచ్చరించారు. క్రికెట్ బెట్టింగులు నిర్వహిసున్న ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కొండపి నుంచి మద్దులూరు వెళ్లే రోడ్డులోని ఒక ప్రదేశం వద్ద బెట్టింగుటు పాల్పడుతున్నారనే సమచారంతో సిఐ, పోలీసు సిబ్బందితో శనివారం దాడి చేశారు. వారి వద్ద నుంచి రూ.80వేల నగదు, 5 సెల్‌పోన్లు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐపిఎల్ జరుగుతున్న నేపథ్యంలో యువకులు బెట్టింగులకు పాల్పడుతున్నారని, దానివలన జీవితాలు నాశనం అవుతాయని తెలిపారు. ఎక్కడైన బెట్టింగులు నిర్వహిస్తున్నట్లు సమాచారం తెలిస్తే పోలీసు చర్యలు తప్పవని అన్నారు.

పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - నాగులుప్పలపాడు

వేసవిలొ పశుపోషకులు, గొర్రెల మేకల పెంపకం దారులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ జెడిఎ డాక్టర్ బేబిరాణి సూచించారు. మండలంలోని ఈదుమూడిలో వేసవిలో పశుపోషణపై అవగాహణ కల్పించారు. వేసవిలో యాజమాన్య పద్ధతులపై వివరించారు. చల్లటి వాతావరణం ఏర్పాటు చేయాలని, అంటువ్యాదులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. పశువులకు దాహర్తి తీర్చించేందుకు చలివేంద్రాన్ని ప్రారంబించారు. తొట్టిల ను ప్రతిరోజు నీటితో నింపాలని అన్నారు. మేతకోసే యంత్రాన్ని 40శాతం సబ్సీడీపై కొండ్రగుంట వెంకటే శ్వర్లు అనే పాడిరైతుకు అందచేసారు. మొలతోటి వెంకట రమణకు 70శాతం రాయితీతో వచ్చిన గేదలను పరిశీలించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి - కొండపి

కొండపి గ్రామంలో గత కొంత కాలంగా అనాద స్వామిజీ బిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్నారు. అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆయనకు ఎవరు లేకపోయే సరికి కొండపి గ్రామానికి చెందిన ప్రెండ్స్ పౌండేషన్ సంస్థ ప్రతినిధులు తలా కాస్త డబ్బుపోగు చేసుకొని ఊరి చివర ఉన్న స్మశాన వాటికలో అంతిమ సంస్కారం నిర్వహించారు. ఎవరులేకపోయిన అనాద స్వామిజీకి ప్రెండ్స్ పౌండేషన్ చేసిన పనికి గ్రామస్తులు అబినందించారు.

ప్రచారంలో దామచర్ల నాగసత్యలత

దామచర్ల నాగసత్యలత ప్రచారం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నగరంలోని 37 డివిజన్, సోనియాగాంధీ నగర్, సమతానగర్‌లో టిడిపి ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్ధన్ సతీమణి నాగసత్యలత శనివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో దామచర్ల అనిషా లక్ష్మీ, తనూజ లక్ష్మీ, 88వ బూత్ ఇంచార్జ్ బెజవాడ మురళీకృష్ణ పాల్గొన్నారు.

హెలిప్యాడ్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న నరేంద్రవర్మ

బాబు కోసం హెలీప్యాడ్ ఏర్పాటు

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలో నేడు జరగనున్న ప్రజాగళం బహిరంగ సభకు విచ్చేయనున్న చంద్రబాబు కోసం బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో హెలిపాడ్ ఏర్పాటు చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం 4:55కు మార్కాపురం నుండి హెలికాప్టర్ ద్వారా బయలుదేరి చంద్రబాబు 5:30గంటలకు బాపట్ల చేరుకుంటారు. అక్కడి నుండి బాపట్ల పట్టణంలో అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగే ప్రజాగళం బహిరంగ సభలో మాట్లాడనున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి టిడిపి నాయకులు ఏర్పాట్లు చేస్తున్నట్లు టిడిపి అభ్యర్థి నరేంద్రవర్మ తెలిపారు. నరేంద్రవర్మతోపాటు బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణ ప్రసాద్, టిడిపి నాయకులు తాతా జయప్రకాష్ నారాయణ, గోలపల శ్రీనివాసరావు, రావిపూడి నాగమల్లేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

టిడిపి పథకాలు వివరిస్తున్న ఎంఎల్ఎ గొట్టిపాటి రవి కుమార్

ఎన్నికల ప్రచారంలో గొట్టిపాటి

ప్రజాశక్తి - సంతమాగులూరు

మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన వైసిపి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ ఆరోపించారు. గత నాలుగు పర్యాయాలు మక్కెనవారిపాలెం నుండి ఎన్నికల శంఖారావం ప్రారంభించి విజయం సాధించారు. అదే సెంటిమెంట్‌తో ప్రచారాన్ని ప్రారంభించారు. గ్రామంలోని ప్రతి వీధిలో తిరిగి ఆప్యాయంగా పలకరిస్తూ చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొట్టిపాటి చౌదరి బాబు, తేలప్రోలు రమేష్, మాజీ ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు, డి గాలెయ్య, సన్నెబోయిన గురుయాదవ్, మక్కెన జగదీష్, చేవూరి వాసురెడ్డి, ఏలూరి శ్రీనివాసరావు, చింతా రామారావు, గాడిపర్తి వెంకటరావు, కొనికి గోవిందమ్మ, మాదాల సుబ్బారావు, ధూపాటి ఏసోబు, నాగబోతు సుజాత, గౌసియా, గుమ్మా జ్యోతి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వైసిపి పథకాలు వివరిస్తున్న పానెం నరసింహారెడ్డి

అన్న కోసం తమ్ముడు ప్రచారం

ప్రజాశక్తి - అద్దంకి

ప్రభుత్వ పథకాలు తమకు తోడుగా ఉంటాయని, నియోజకవర్గంకు కొత్తయినా వివిధ పర్యటనల సందర్భంగా ప్రజల చూపిస్తున్న ఆదరణ ఉత్సాహన్ని స్తుందని వైసీపీ అభ్యర్థి పానేం హనిమిరెడ్డి సోదరుడు నరసింహరెడ్డి అన్నారు. గత రెండు రోజుల నుండి పట్టణంలో ఆయన గడప గడప కార్యక్రమం నిర్వహిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా లభించిన లబ్ది వివరాలు ఓటర్లకు వివరిస్తున్నారు. కార్యక్రమంలో కోట శ్రీనివాసకుమార్, ఊడత్తు సురేష్, వైస్ చైర్మన్ అనంతలక్ష్మి, వీరయ్య, కౌన్సిలర్ సుదీర్ పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వారితో ఎంఎల్ఎ ఏలూరి

పేదరిక నిర్మూలనే లక్ష్యం

ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

పేదల జీవితంలో వెలుగులు నింపడమే టిడిపి లక్ష్యమని టిడిపి బాపట్ల పార్లమెంటు అధ్యక్షులు, ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు అన్నారు. పర్చూరు, యద్దనపూడి, మార్టూరు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు మండలాల్లోని పలువుర వైసిపి కార్యకర్తలు ఇసుకదర్శిలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో టిడిపిలో చేరారు. వీరందరికీ ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు టిడిపి జెండాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

కవాతు నిర్వహిస్తున్న బిఎస్ఎఫ్ జవాన్లు

పోలీసు కవాతు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అలజడులు లేకుండా ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు తీసుకోవలసిన చర్యలపై ముందుగానే భట్టిప్రోలు, వెల్లటూరు ప్రాంతాల్లో బిఎస్ఎఫ్ జవాన్లు శనివారం కవాతు నిర్వహించారు. ఎస్ఐ కె శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు కవాతు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రజాస్వామ్యం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సక్రమంగా వినియోగించుకునేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ఓటు అనే ఆయుధంతో నీతి నిజాయితీగల నాయకులను ఎన్నుకునేందుకు అవకాశం లభిస్తుందని అన్నారు. ఆమేరకు ప్రజలంతా సంసిద్ధంగా ఉండాలని కోరారు.

సంతమాగులూరు : మండలంలో సమస్యాత్మక గ్రామాలైన కామేపల్లి, వెల్లలచెరువు, పాత మాగులూరు గ్రామాల్లో బిఎస్ఎఫ్ సైనికులు శనివారం కవాతు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా సైనిక కవాతు నిర్వహిస్తున్నట్లు సిఐ కె నరసింహారావు, ఎస్ఐ పి సురేష్ తెలిపారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో పాలిసెట్ ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణా తరగతులు ఏప్రిల్ ఒకటి నుండి ప్రారంభం అవుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. శిక్షణకు వచ్చే విద్యార్థులకు మాత్రమే ఉచిత మెటీరియల్ అందజేస్తామని తెలిపారు. శిక్షణ తరగతులు ప్రతిరోజు ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకని తెలిపారు. పూర్తి సమాచారం కోసం 99491 41277, 97055 18378 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు రాచపూడిలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-మేదరమెట్ల

ఒంగోలులోని ఉపాస్ హాస్పిటల్స్ సహకారంతో జిపిఐ-ఎఫర్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని రాచపూడి ఎంపిపి స్కూల్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు హాస్పిటల్ డైరెక్టర్లు డాక్టర్ ఉమాపతి చౌదరి, డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ అనపర్తి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యశిబిరంలో డాక్టర్ అనపర్తి శ్రీనివాస్‌తో పాటు డాక్టర్ గోనుగుంట్ల శ్రీనివాస్, కంటి వైద్యులు రామసుబ్బారెడ్డి వైద్యసేవలందిస్తారని పేర్కొన్నారు. బీపీ, షుగర్‌తో పాటు కంటి పరీక్షలు ఉచితంగా చేసి.. ఉచితంగా మందులు ఇస్తారని పేర్కొన్నారు. ఈ వైద్యశిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాలాజీకి సహాయ నిరాకరణ

కారంచేడు వైసిపి నాయకుల నిర్ణయం

ప్రజాశక్తి - కారంచేడు

వైసిపి అభ్యర్థి యడం బాలాజీకి సహకరించేది లేదని ఆ పార్టీకి చెందిన పలువురు మండల నాయకులు ప్రకటించారు. ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, వైసిపి మండల కన్వీనర్ తోపాటు పలువురి నాయకులు పట్ల బాలాజీ అనుచితంగా మాట్లాడటంతోపాటు మండలంలో తమకు సంబంధం లేకుండా వ్యక్తిగతంగా కార్యక్రమాలు చేసుకోవడం వంటివి జరుగుతున్నాయని ఆరోపించారు. వైసిపి మండల నాయకులకు, ఎంపీపీ, జడ్పిటిసికి తెలియకుండా బాలాజీ వ్యక్తిగత ధోరణితో మండలంలో కార్యక్రమాలు చేస్తున్నాడని, తాము అడిగితే తమను దూషించాడని, వైసీపీలో ఉంటే ఉండండి, నచ్చకపోతే బయటకు వెళ్లిపోండి, మీకు చెప్పాల్సిన అవసరం లేదని వ్యక్తిగతంగా తమను అవమానపరిచాడని ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, వైసీపీ కన్వీనర్ దండా చౌదరి బాబు మరికొంత మంది నాయకులు మీడియాకు శనివారం తెలిపారు. వైసిపి కన్వీనర్ సొంత గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఒక వ్యక్తికి ఆర్థిక సహాయం నిమిత్తం గ్రామానికి వచ్చిన బాలాజీ అదే గ్రామంలో ఉన్న వైసిపి మండల కన్వీనర్‌కు కనీస సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు. అనేక గ్రామాల్లో ఆయా గ్రామాల వైసీపీ నాయకులకు సమాచారం లేకుండానే బాలాజీ

నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపిపి నీరుకట్టు వాసుబాబు

కార్యక్రమాలు జరుపుతున్నారని చెప్పారు. ఇకనుంచి తమ మండలంలో వైసీపీ ఇన్చార్జి యడం బాలాజీకి తాము సహకరించేది లేదని తేగేసి చెప్పారు. దీనిపై వైసిపి అధిష్టానంకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అందరినీ కలుపుకొని పోవాల్సిన ఇన్చార్జి నాయకుల్ని దుర్భాషలాటం, దూరం పెట్టడం వంటివి తమకు మనస్థాపానికి గురి చేశాయని చెప్పారు. సమావేశంలో మండల కోఆప్షన్ సభ్యులు ముల్లా నూరు అహ్మద్, ఆదిపూడి సర్పంచి నాగరాజు, ఉప సర్పంచ్ సుబ్బారెడ్డి, మోహనరెడ్డి, ఆదిపూడి ఎంపిటిసి భవనం వెంకటేశ్వరరెడ్డి, సర్పంచి శ్రీనివాసరెడ్డి, తిమిర్తితపాడు ఎంపీటీసీ కోటేశ్వరమ్మ, దగ్గుబాడు ఎంపిటిసి షేక్ మౌలాలి, పిఎసిఎస్ చైర్మన్ షేక్ నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

సమాజ నిర్మాణం గురువుల బాధ్యత

ప్రజాశక్తి - బాపట్ల

సమ సమాజ నిర్మాణానికి గురువుల బాధ్యత మహోన్నతమైందని బాపట్ల అన్నవరపు విద్యాభివర్ధిని సంఘం కార్యదర్శి బొమ్మిశెట్టి హరినాధ మురళి అన్నారు. పట్టణంలోని ఎవివి ఉన్నత పాఠశాల్లో మూడున్నర దశాబ్దాల పాటు ఉపాధ్యాయ బాధ్యతలు నిర్వర్తించి హెచ్‌ఎంగా ఉద్యోగ విరమణ చేసిన ఎస్‌విఆర్‌వి ప్రసాద్‌ను శనివారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా హరినాధ మురళి మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది పాఠశాల అభివృద్ధికి ప్రసాద్ ఎంతగానో పాటుపడ్డారని అన్నారు. హెచ్‌ఎం ప్రసాద్, కృష్ణకుమారి దంపతులను పాఠశాల పాలకవర్గం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో

హెచ్‌ఎం ప్రసాద్ దంపతులకు ఘన సన్మానం

పెన్షనర్ల సంఘం అధ్యక్షులు వైవి నరసింహారావు, కొంపల్లి గంగాధరరావు, దీక్షితులు, ఇన్చార్జి హెచ్‌ఎం యడ్ల సత్యవతి, పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ భవనంపై నుంచి పడి

సచివాలయ ఉద్యోగి మృతి

భవనంపై నుండి పడి మృతి చెందిన మల్లయ్య

ప్రజాశక్తి - మార్కాపురం

ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడి సచివాలయ ఉద్యోగం మృతి చెందిన సంఘటన పట్టణంలోని పంచాయతీరాజ్ కార్యాలయం సమీపంలో శనివారం జరిగింది. ప్రమాదంలో బేతం మల్లయ్య (34) మృతి చెందాడు. మృతుడు నంద్యాల జిల్లా సున్నిపెంట గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మార్కాపురం మున్సిపాలిటీలోని 12వ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. అతనికి వివాహం కాలేదు. ప్రమాదం జరిగిన సమయంలో స్థానికులు స్థానిక ప్రభుత్వ జిల్లా వైద్యశాల్లో చేర్పించారు. పరిస్థితి విషమించి మృతి చెందాడు. పట్టణ ఎస్ఐ షేక్ అబ్దుల్ రెహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బేతం మల్లయ్య (ఫైల్ ఫోటో)

చైతన్యంతో ఓటు హక్కు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని అన్నంబోట్లవారిపాలెంలో ఓటరు అవగాహనా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఓటర్లు చైతన్య వంతంగా ఓటు చేయాలని తహశీల్దారు సుబ్బయ్య సూచించారు. ఎవ్వరూ ఓటు వేయకుండా ఉండరాదని చెప్పారు. ఓటు వేయడం ఒక బాధ్యతని తెలిపారు. ప్రలోభాలకు లొంగకూడదని చెప్పారు. మంచి వ్యక్తిత్వంతో ఓటు హక్కును వినియోగించు కోవాలని తెలిపారు. ఏదైనా కోడ్ ఉల్లంఘనలు ఉంటే సీ విజిల్ యాప్ ద్వారా పిర్యాదు చేయవచ్చని చెప్పారు.

మాట్లాడుతున్న తహశీల్దారు సిహెచ్ సుబ్బయ్య

సమావేశంలో పంచాయతీ కార్యదర్శి కె రాణి, ఆర్ఐ ప్రేమ్ కుమార్, విఆర్ఒలు, బిఎల్ఒలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్ ఫణీంద్రబాబు

శిక్షణ తప్పనిసరి

ప్రజాశక్తి - పర్చూరు

ఎన్నికల రిటర్నింగ్ అధికారి, బాపట్ల ఆర్‌డిఒ జి రవీందర్ అధ్యక్షతన నియోజకవర్గం పరిధిలో పోలింగ్ నిర్వహణలో ఉండే పిఒ, ఎపిఒలకు శిక్షణ ఇచ్చే మాస్టర్ ట్రైనర్స్‌కు, సెక్టర్ అధికారులకు ఈవీఎం, వివిపిటి సియు, బియుల పని విధానం, పోలింగ్ సందర్భంగా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి స్థానిక వైఆర్ హైస్కులు ఎదురు గల క్రీడా వికాస కేంద్రం నందు శిక్షణ నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్, చినగంజాం తహశీల్దారు జివిఎన్ ఫణింద్రబాబు డెమో ద్వారా వివరించారు. నమూనా పోలింగ్, ఎన్నికల ఫారాలు పూర్తి చేయడం, పోలింగు రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సిబ్బంది ఇలాంటి విషయాలను ముందుగానే తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పర్చూరు, యద్దనపూడి, మార్టూరు, కారంచేడు తహశీల్దార్లు సిహెచ్ సుబ్బయ్య, వై నాగరాజు, మార్టూరు కె సంధ్యశ్రీ, మెహర్ బాబు, మాస్టర్ ట్రైనర్స్ ఇ రాజశేఖర్, రాఘవరెడ్డి, దేవేందర్, ఎఎస్ఒ శ్రీమన్నారాయణ పాల్గొన్నట్లు ఎన్నికల డిప్యూటి తహశీల్దారు పి సూర్యనారాయణ తెలిపారు.

1 నుండి కేంద్రీయ విద్యాలయ ప్రవేశాలకు దరఖాస్తు

ప్రజాశక్తి - బాపట్ల

సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఆవరణలోని కేంద్రీయ విద్యాలయలో రెండు నుండి 9వ తరగతి వరకు ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ మృదుల తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థల తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 1నుండి 10వరకు పాఠశాలకు వచ్చి దరకాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థుల జనన ధృవీకరణ, నివాస ధృవీకరణ, విద్యార్థి పేరుతో కుల ధృవీకరణ పత్రం, వెనుకబడిన తరగతుల వారైతే ఒబిసి సర్టిఫికేట్, తల్లి, తండ్రి, విద్యార్థి ఆధార్ కార్డు, బ్లడ్ గ్రూప్ సర్టిఫికేట్, విద్యార్థి పాస్‌పోర్టుసైజు ఫోటో, విద్యార్థి పాఠశాల బదిలీ పత్రం (టిసి) తీసుకుని రావాలని సూచించారు.

మాట్లాడుతున్న ఎస్ఎస్ఎ జిల్లా కన్వీనర్ జోత్స్న

'సహిత విద్య'పై అవగాహన

ప్రజాశక్తి - బాపట్ల

ప్రత్యేక అవసరాలు కలిగిన బాల, బాలికల సమ్మిళిత సహిత విద్యపై మరింత అవగాహన అవసరమని జిల్లా సమగ్ర శిక్ష విభాగం ప్రతినిధి ఎం సుధాకర్ అన్నారు. స్థానిక ఎబీఎం హైస్కూల్లో శనివారం నిర్వహించిన సమగ్ర శిక్ష విభాగం దివ్యాంగ బాలలసహిత విద్యపై ఒకరోజు శిక్షణలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక అవసరాల బాలల విద్యాబోధనపై జిల్లాలో ప్రధానోపాధ్యాయులు, అంగన్ వాడి సూపర్వైజర్లకు అవగాహన కల్పించారు. జిల్లా సమన్వయకర్త మట్ట జ్యోత్స్న మాట్లాడుతూ చట్టంలో ఉన్న 21రకాల వైకల్యాలను వివరించారు. జిల్లాలోని సహిత విద్యా సంరక్షిత విభాగం ద్వారా దివ్యాంగ పిల్లలకు అందించే సేవలను వివరించారు. పిజియోథెరఫీ చేస్తే ఆరోగ్యం మెరుగుపడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కృత్రిమ అవయువాలను అమర్చుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, అంగన్‌వాడి సూపర్వైజర్లు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న

ప్రభుత్వ ఉపాధ్యాయుడు సస్పెన్షన్

ప్రజాశక్తి-శింగరాయకొండ

మండలంలోని బింగినపల్లి గ్రామ పంచాయతీ, ఎస్టీ కాలనీలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కేశవరపు జాలిరెడ్డిని సస్పెన్షన్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర శనివారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కోడ్ సమయంలో నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం, కరేడు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున జాలిరెడ్డి పాల్గొన్నారు. దీనిపై ఫిర్యాదు అందడంతో ఎన్నికల కమిషనర్ జిల్లా విద్యాశాఖ అధికారి సుభద్రను విచారణ అధికారిగా నియమించారు. విచారణ చేసిన అనంతరం ప్రచారం పాల్గొన్నారని తేలడంతో జాలిరెడ్డిని సస్పెండ్ చేశారు. జాలిరెడ్డి వైయస్సార్ టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులుగా ప్రస్తుతం వైయస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా ఉన్నారు.

12 సీట్లూ వైసిపివే: బాలినేని

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

రానున్న ఎన్నికల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 12 సీట్లకు 12 సీట్లు వైసిపి గెలుచుకుంటుందని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. నియోజకవర్గంలో తన ఎన్నికల ప్రచారాన్ని ఒంగోలు నగరంలోని 17వ డివిజన్ అంబేద్కర్ కాలనీ నుంచి శనివారం ఆయన ప్రారంభించారు. ఇంటింటికీ తిరిగి రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ రాష్ట్రంలో కూడా 135 స్థానాలకు పైగా వైసిపి గెలుచుకొని తిరిగి అధికారంలోకి వస్తుందని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తేనే సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతోందని ప్రజలు నమ్ముతున్నారని వివరించారు. వచ్చే నెల తొమ్మిదిన వైసిపి మ్యానిఫెస్టో విడుదల అవుతుందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తాను గెలిస్తే ఒంగోలు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. తాను పేదలకు ఇటీవల ఇచ్చిన దుస్తులపై మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ఆయన గతంలో ఏం చేశాడో చెప్పుకొని ఓట్లు అడగాలే తప్పా అనుచిత వ్యాఖ్యలు సరికాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షులు కటారి శంకర్, 17వ డివిజన్ కార్పొరేటర్ నాగం వెంకటశేషయ్య, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు. శనివారం సాయంత్రం ప్రగతి కాలనీలో కూడా బాలినేని శ్రీనివాసరెడ్డి ఎన్నికల ప్రచారం కొనసాగింది.

మహిళతో మాట్లాడుతున్న బాలినేని

ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పోలీసులు

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఎస్పీ వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రానున్న సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు స్వేచ్ఛగా వారి ఓటు హక్కును వినియోగించుకునే విధంగా వారికి పోలీస్ శాఖ అండగా ఉంటుందనే భరోసాను కల్పించడానికి బాపట్ల జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలలో ఉన్న సమస్యాత్మక గ్రామాలలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, కేంద్ర సాయుధ బలగాలతో సంయుక్తంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం జిల్లాలోని బాపట్ల రూరల్, మార్టూరు, సంతమాగులూరు, భట్టిప్రోలు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని సమస్యాత్మకమైన గ్రామాలలోని ప్రజల్లో ధైర్యాన్ని నింపే విధంగా కేంద్ర బలగాలతో పోలీస్ సిబ్బంది ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

తాగునీటి సమస్యకు బాధ్యులెవరు?

- సిద్ధంగా ఉన్నామంటున్న అధికారులు
- అందుబాటులో ఉండని సర్పంచ్
- నీటి కోసం అల్లాడిపోతున్న జనం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ గ్రామ పంచాయతీలో మంచినీటి సమస్యకు బాధ్యులు ఎవరనేది ఎవరికీ అర్థం కాని ప్రశ్నగా మారింది. తాగునీటి విషయంలో అధికారులు తాము సిద్ధంగానే ఉన్నామని, ఎలాంటి ఇబ్బందులు లేవని చెప్తున్నారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ తాటిపర్తి వనజ మాత్రం ప్రజలకు అందుబాటులో ఉండటం లేదు. శింగరాయకొండ గ్రామ పంచాయతీలో తాగునీటి సమస్య తీవ్రమైంది. ఒక పక్క రామతీర్థం నీళ్ల పూర్తిస్థాయిలో రాకపోవటం.. మరోపక్క మన్నేరులో ఉన్న బావి ఎండిపోవడం వంటి సమస్యలు ఇక్కడ ఉన్నాయి. సర్పంచి అందుబాటులో ఉండి.. అధికారులతో సమీక్షలు చేస్తే మంచినీరు ప్రతి ఇంటికి అందించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో ఉండటం వల్ల ఇక్కడ అధికారుల ఆధ్వర్యంలో కొన్ని పనులు జరుగుతూ ఉంటాయి. ఎప్పుడో సమావేశాలకు అలా వచ్చి ఏమైనా అధికారిక కార్యక్రమాలు ఉంటే చూసుకొని వెళ్లే పరిస్థితి ఇక్కడ సర్పంచ్‌కు ఉంది. శనివారం నాడు ప్రజాశక్తిలో వచ్చిన 'శింగరాయకొండలో దాహం కేకలు' కథనంపై అధికారులు స్పందించారు. అధికారుల వైపు నుంచి ఇప్పటికే మన్నేరును పరిశీలించామని, అక్కడ రెండు బోర్లు వేసి నీరిచ్చేందుకు కషి చేస్తున్నామన్నారు. అయితే తన వైపు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తున్నప్పటికీ ఇక్కడ ఉన్న ప్రజాప్రతినిధులు అందుబాటులో లేనందువలన కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఆ ఇబ్బందులను పరిష్కారం చేస్తే ప్రతిరోజూ మంచినీరు ఇచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. అక్కడ మోటార్ బాగు చేసి శనివారం నాడు మోటార్ బిగించే ప్రయత్నం చేశామని, అదేవిధంగా రామతీర్థం నుంచి కూడా పూర్తిస్థాయిలో నీరు వచ్చేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నామని పేర్కొన్నారు. శనివారం నాడు సాయంత్రం మోటార్ బిగించినప్పటికీ పాత శింగరాయకొండ గ్రామపంచాయతీ పరిధిలోని గవతగట్లవారిపాలెం వద్ద జెసిబితో కాంపౌండ్ వాల్‌కు గుంట తీస్తుండగా పైపులు పగిలిపోయి నీరు వథాగా పోవటం కూడా జరిగింది. ఇవి ఖర్చుతో కూడిన పనులు కావడంతో గ్రామపంచాయతీలో సర్పంచ్ అందుబాటులో ఉంటే సమస్య త్వరితగతిన పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు.

వృథాగా పోతున్న తాగునీరు

పోటీకి సిద్ధం

ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రధాన పార్టీల తరపున అభ్యర్థులు సిద్ధమయ్యారు. పలు దఫాలుగా పార్టీలు జారీ చేసిన జాబితాల్లో వైసిపి, తెలుగుదేశం పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. ఇంకా కాంగ్రెస్ పార్టీ కూడా అభ్యర్థులపై కసరత్తు చేస్తోంది. ఏదేమైనా నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల నుంచి అభ్యర్థులు పోటీకి సిద్ధమయ్యారు. ఎన్నికల వ్యూహాల్లోకి దిగిపోయారు. ఇప్పటికే కొందరు అభ్యర్థులు తొలివిడత ప్రచారం ముగించారు. కొందరు ఇప్పుడిప్పుడే రంగంలోకి దిగుతున్నారు. కొందరు చేరికలపై దృష్టి సారించారు. నిత్యం ఇదే పనుల్లో కొందరు నేతలున్నారు. ముఖ్యంగా రెండు పార్టీలు ఈ తరహా వ్యవహారాలపై దృష్టి సారించాయి. అన్ని కోణాల్లో గెలుపు కోసం పావులు కదుపుతున్నారు. ఇప్పటికే వివిధ వర్గాలకు తాయిలాలు అందించారు. వాలంటీర్లు మొదలు వైసిపికి అనుకూలంగా ఉ ండే వర్గాలకు అన్ని రకాలుగా ప్రలోభాల పర్వం నడిచింది. ఇప్పుడు పోలింగ్ సమయం చాలా దూరంలో ఉన్నందున అభ్యర్థులు ఎన్నికల ప్రచారాలకు దిగడం లేదు. గ్రామాల్లో చేరికలపైనే ఎక్కువ కేంద్రీకరించారు. ఇవే ఇప్పుడు సాగుతున్నాయి. అసంతృప్తులను బుజ్జగించుకోవడం.. గ్రామాల్లో కీలక నేతలను ప్రసన్నం చేసుకోవడం.. వివిధ సామాజిక తరగతులతో ఆత్మీయ సమ్మేళనాలు.. ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్ల వద్దకు వెళ్లి సమావేశాలు వంటి వాటిపై అభ్యర్థులు దృష్టి సారించారు. ఓటు కోసం పడరాని పాట్లు పడుతున్నారు. నిన్నటివరకూ జరిగిందొకటైతే ఇప్పుడు అంతా రాజకీయ దుమారమే సాగుతోంది. పాలకపక్షం కూడా సంక్షేమ ఎజెండాతోనే కుదరదనే భావనకు వచ్చేశారు. సామాజిక అంశాన్ని కీలకంగా తీసుకున్నారు. దీనికి తోడు ఆర్థికం ప్రధాన ఎజెండాగా తీసుకునే ఎన్నికల క్యాంపులను నడుపుతున్నారు. సిఎం జగన్ సిద్ధం పేరుతో నిర్వహించిన సభ తర్వాత వైసిపి శిబిరాలు కొంత నెమ్మదించాయి. కొత్త నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నందున అభ్యర్థులు అందరూ ముందు గ్రామాల్లో కీలక నేతలతో చర్చలు, పరిచయాలు సాగిస్తున్నారు. టిక్కెట్లు రాని నేతలు అభ్యర్థులకు సహకారం కూడా ఎండమావిగా మారింది. సిట్టింగులు తమ రాజకీయ భవితవ్యంపై గందరగోళంగా ఉన్నారు. ఇక అభ్యర్థులు రెండు పార్టీలకూ తేలిపోయారు. కొత్తగా పోటీ చేయడానికి కూడా వైసిపి, తెలుగుదేశంలో స్థానాలు లేవు. కాంగ్రెసు వైపుకు వెళ్లే వారికి అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్నికల ప్రచారానికి రాష్ట్రస్థాయి నేతలూ వస్తున్నారు. ఆదివారం నాడు మార్కాపురం పట్టణానికి తెలుగుదేశం అధినేత చంద్రబాబు వస్తున్నారు. ఎన్నికల ప్రచారసభలో పాల్గొంటారు. ఇందుకోసం తెలుగుదేశం శ్రేణులు సన్నద్ధమయ్యాయి. ఎన్నికలపై అధికారులు నిబంధల అమలు కోసం మీడియా సమావేశాలు పెడుతున్నారు. తనిఖీలు పెంచారు.

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఎన్నికల ముందు తెచ్చిన సిఏఏ నిరంకుశ చట్టమంటూ వామపక్ష, లౌకికపార్టీల నేతృత్వంలో ఒంగోలులో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. సిపిఎం, సిపిఐ, కాంగ్రెసు పార్టీ, ఇతర వామపక్షాల నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముస్లిం సంఘాల నేతలు, పెద్ద ఎత్తున ముస్లిములు ర్యాలీలో పాల్గొన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి విశ్రీనివాసరావు కార్యక్రమానికి ప్రత్యేకంగా హాజరయ్యారు. ఎన్నికల్లో హిందువుల ఓట్లు కోసం బిజెపి ప్రభుత్వం ఇలాంటి దుర్మార్గపు చట్టాలను తీసుకురావడం ఆందోళనకరమన్నారు. కేవలం ముస్లిములకే కాకుండా ఇతర మైనార్టీలకు ఈ చట్టం ప్రమాదకరమని హెచ్చరించారు. పార్లమెంటులో ఇండియా కూటమి సిఏఏకు వ్యతిరేకంగా బిల్లుపెడుతోందని..దీనిపై టిడిపి, వైసిపి తమ వైఖరి స్పష్టం చేయాలని కోరారు. ఈ చట్టాన్ని నిలిపేయాలని అన్ని పార్టీల నేతలూ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు.

ఎన్నికల వేళ జిల్లా అంతటా దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఎండలు తీవ్రమవుతున్నాయి. ఈ ఏడాది సాగర్‌జలాలు లేనందున ముందుగానే భూగర్జజలాలు అడుగంటాయి. బోర్లు ఎండుతున్నాయి. నీటివనరులు ప్రమాదంగా మారాయి. దీంతో నీటికి కటకటలాడుతోంది. ఇటీవల వచ్చిన సాగర్ జలాలకు తాగునీటి చెరువులు నిండలేదు. అరకొరగానే వచ్చాయి. ఇప్పుడు తాగునీటి ఎద్దడి తలెత్తింది. బిందెలు తీసుకొని రోడ్లెక్కుతున్నారు. పశ్చిమాన అన్ని మండలాల్లో నీటి ఎద్దడి తీవ్రమవుతోంది. గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు మళ్లీ ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. పశువులకు కూడా నీటి సమస్య తీవ్రంగా ఉంది. పొలాల్లో ఎక్కడా నీళ్లు లేవు. వేసవి తీవ్రమవుతోంది. ఎండలు పెరిగే కొద్దీ ఈ సమస్య పెరుగుతుంది. ఇప్పటికైనా అధికారులు తాగునీటి సమస్యపై దృష్టి సారించాలి.

గొట్టిపాటి, మాగుంటను గెలిపించాలి..

టిడిపి దర్శి అభ్యర్థి లక్ష్మి భర్త కడియాల లలిత్‌సాగర్

ప్రజాశక్తి-దర్శి

వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థులు గొట్టిపాటి లక్ష్మి, మాగుంట శ్రీనివాస్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి భర్త కడియాల లలిత్ సాగర్ కోరారు. శనివారం స్థానిక కురిచేడు రోడ్‌లోని పూసల సంజీవయ్య, తిరువతమ్మ, కళ్యాణ మండపంలో తెలుగుదేశం పార్టీ ఆత్మీయ సమ్మేళనం నియోజకవర్గం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లలిత సాగర్ మాట్లాడుతూ గతంలో మార్టూరు నియోజకవర్గంలో గొట్టిపాటి హనుమంతరావు, నరసయ్య, రవికుమార్‌లు గెలిచి మంత్రిగా, ఎమ్మెల్యేలుగా కొనసాగారన్నారు. గొట్టిపాటి హనుమంతరావు మనవరాలుగా గొట్టిపాటి లక్ష్మి ఇక్కడ పోటీ చేస్తున్నారని, గొట్టిపాటి రవికుమార్ ఎప్పుడూ ఓటమి ఎరగలేదని, మొదటిసారిగా పోటీ చేస్తున్న లక్ష్మిని తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేస్తున్నందున నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా దర్శి మాజీ శాసనసభ్యులు పాపారావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా గొట్టిపాటి లక్ష్మిని అందరి సమన్వయంతో పని చేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కూరపాటి శ్రీను, నాగులపాటి శివకోటేశ్వరరావు, నెమలయ్య, టౌన్ పార్టీ అధ్యక్షుడు యాదగిరి వాసు, నాయకులు మోడీ ఆంజనేయులు, పౌలు, బిసిరెడ్డి, తిని నారాయణరెడ్డి, స్టీవెన్, మాడపాకుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లలిత్‌సాగర్

మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

వైసిపి దర్శి ఎమ్మెల్యే అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-దర్శి

వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గ్రామాల అభివద్ధికి ప్రజల సహకరించాలని వైసిప దర్శి అభ్యర్థి, మాజీ శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రాజంపల్లి గ్రామంలో మన ఊరికి మన శివన్న కార్యక్రమంలో భాగంగా ప్రచార ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందాలంటే వైసిపికి పట్టం కట్టాలన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలన్నా, పథకాలను పొందాలన్నా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఎమ్మెల్యే అభ్యర్థిగా శివప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపాటి సుధారాణి, అచ్చయ్య, సర్పంచి వనం అన్నపూర్ణ, విజయ్, జెసిఎస్ కన్వీనర్ తూర్పు వెంకటాపురం సహకార సంఘం అధ్యక్షుడు బత్తినే వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి పాల్గొన్నారు.